ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

అక్టోబర్ 04, 2009

కథా నిలయం శ్రీకాకుళం

కథా నిలయం శ్రీకాకుళం

43698

వందేళ్ల వందనాలు !



హ్యాపీ బర్త్‌డే

(2009 అక్టోబర్ 4 నుంచి 2009 అక్టోబర్ 10 వరకు)

యన్. ప్రత్యూష్
8సం॥, అక్టోబర్-2001
సుభాషిణి-అంజయ్య
హైదరాబాద్

ఇ. బిందుప్రియ
8సం॥, అక్టోబర్-2001
సంధ్య-మధుసూదన్‌గౌడ్
తోమాలపల్లి-మ॥నగర్

ఇ. మనోజ్‌కుమార్‌గౌడ్
2సం॥, అక్టోబర్-2007
సంధ్య-మధుసూదన్‌గౌడ్
తోమాలపల్లి-మ॥నగర్

ఎం. వాసంతి(హనీ)
1సం॥, అక్టోబర్-2008
ఆదిలక్ష్మి-వెంకటకృష్ణ
యనమలకుదురు-విజయవాడ

ప్రవలిక
1సం॥, అక్టోబర్-8
జ్యోతి-రమేష్
కొలకలూరు-గుంటూరు

సంజయ్
అక్టోబర్-8
కుమారి-విజయ్‌కుమార్
కొలకలూరు-గుంటూరు

పి. ఎల్. హిమబిందు
4సం॥, అక్టోబర్-2004
సీతారావమ్మ-వెంకటమహాత్మాగాంధీ
తుళ్లూరు-గుంటూరు

శ్రీధర్‌రెడ్డి
4సం॥, అక్టోబర్-2004
వసంత-ధర్మారెడ్డి
పామన్‌గుండ్ల-నల్లగొండ

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి.

అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

వున్నట్టా...లేనట్టా...

అదేంటోగాని...ఒక్కోసారి దేన్నీ నమ్మబుద్ధికాదు.

అంతా స్పష్టంగా కనిపిస్తున్నా... వినిపిస్తున్నా... ఏదో శంక! మరేదో సంశయం!!

అసలు మనం చూస్తోందీ, వింటోందీ నిజమేనా అన్న అనుమానం పెనుభూతంలా వెంటాడుతుంటుంది. కల, నిజమూ తారుమారుగా కనిపిస్తాయి. చేతిమీద గిచ్చుకుని చూసినా నిజం కాదేమో! భ్రమేమో అనిపిస్తుంది. అంతా చిత్తచాంచల్యంగా తోస్తుంది.

❑❑❑

మన నూతన ముఖ్యమంత్రిగారిది ప్రస్తుతం సరిగ్గా ఇదే పరిస్థితి. ఆయన ఎంచక్కా సీఎం కుర్చీలో కూర్చునే వున్నారు. సీఎంగా ఫైళ్లమీద వేళ్లు నొప్పి పుట్టేలా సంతకాలు చేసేస్తున్నారు. టీవీల్లో పేపర్లలో ముఖ్యమంత్రిగా ఆయన పేరే కనిపిస్తుంది. అయినా అనుక్షణం ఏదో అనుమానం. తను నిజంగా ముఖ్యమంత్రేనా! నిజంగా తనే కనుక సీఎం అయితే మంత్రులూ, ఎమ్మెల్యేలూ అలా ఎందుకు కిష్కిందకాండ సాగిస్తారు? 'అతని'కోసం వీరలెవల్లో రాజీనామా లేఖలు ఎందుకు ఎక్కుపెడతారు? సీఎం స్థానంలో తనున్నా... లేనట్టుగా 'అతడి'నే ముఖ్యమంత్రిని చేయమంటూ ఎందుకు రభస చేస్తున్నారు? అసలు అధిష్టానం నిజంగా తనవైపే వుందా? వుంటే గాఠ్ఠిగా తనే సీఎం అని ఎందుకు చెప్పదు? గోలచేస్తున్న పిల్లకాకులను ఎందుకు తరమదు? అన్న సంశయం ప్రతి క్షణం ఆయనను వెంటాడుతోంది.

అటుచూస్తే 'అతని'దీ దాదాపు ఇదే సీను. సీఎం పదవి వరిస్తుందా? లేదా? కలగానే మిగిలిపోతుందా? వాస్తవరూపు దాలుస్తుందా? చూస్తుంటే దరిదాపుల్లోనే వున్నట్టుంటుంది. అంతలోనే అందనంత దూరంలో వెక్కిరిస్తున్నట్టుంటుంది. తనకోసం తనను సీఎం కుర్చీలో కూర్చుండగా చూడడంకోసం ఎన్నో విన్యాసాలు బీభత్సాలు చేస్తున్న మంత్రులను, ఎమ్మెల్యేలను చూసినప్పుడు...వారి మాటలు విన్నప్పుడు తప్పకుండా సీఎం అయినట్టే అనిపిస్తుంది. అయితే ఈ విషయమై ఏం తేల్చకుండా మూతి బిడాయించుకుని కూర్చున్న అధిష్టానాన్ని చూస్తే మాత్రం కాను సుమా! కాలేను సుమా. కలలు కల్లలే అనిపిస్తుంది. ఏదో తెలీని భ్రమ మాత్రం నిత్యం నీడలా వెన్నాడుతుంటుంది.

ఎవరి భ్రమల్లో వాళ్లు...ఎవరి కలల్లో వాళ్లు...ఎవరి శంకల్లో వాళ్లు... కొట్టుమిట్టాడుతున్నా...ఒకటి మాత్రం నిజం. భ్రమ కాదు సుమా. అదేంటంటే...ఒకరికి అంత శక్తి లేదని...మరొకరికి అంత అనుభవం లేదని అధిష్టానానికి ఎరుకే. అయితే సరైన సమయం వచ్చినప్పుడు ... ఎవరికేది చెప్పాలో వారికది చెప్పడం అధిష్టానానికి వెన్నతో పెట్టిన విద్యకదా. కాకపోతే వారికీ అదే అయోమయం. ఎవరు నిజం? ఎవరు కల్ల?

✶

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
న్యాయ సలహాలు	...	6
రుచి	...	7
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
నవ్వుల్ పువ్వుల్	...	20
కథ	...	22
కొత్తపుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

కదిలించిన శౌర్యగాథ
మదివెలిగిన అరుణతార



చూద్దామా ... 8

అన్నీ...
వ్యర్థాలతో సృజించిన
కళాఖండాలే

సినిమా కబుర్లు ... 21

చెల్లెళ్ల కోసం....



మార్క్స్ వచనాలు తెల్సుకోవాల్సిందే

సెప్టెంబర్ 20 ఆదివారం సంచికలో "యువమేధ మెరుపు జీవితానికే మలుపు' అన్న వ్యాసంలో రచయిత జీవితానికి మలుపు ఇచ్చిన పుస్తకాల విషయాలు చాలా బాగున్నాయి. ఆణిముత్యాల వంటి మార్క్స్ వచనాలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఎవరైనా తనకోసం తాను పనిచేస్తే పండితుడు. మహర్షీ, మహాకవి కావచ్చు. కానీ మానవ కళ్యాణం చేస్తూ తనను తాను పరిపుష్టి చేసుకొన్నవాడే ధన్యుడు. ఇది తిరుగులేని సత్యం.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డి అన్నారం, హైదరాబాద్.

రంజాన్ పర్వం రసరమ్యం

సెప్టెంబర్ 20 నాటి స్నేహ సంచిక అట్టమీది కథగా రంజాన్ పర్వదిన విశేషాలను, అనేక ప్రధాన అంశాలను ఆకళింపు చేసుకునే అవకాశం కలిగింది. 'ఆరోగ్యం ద్వారా 'గుండెపోటు' సంబంధిత విశేషాల్ని చాలా వుపయుక్త సమాచారాన్నందించాయి. 'తెల్సా' శీర్షికలో సిగరెట్టు పెట్టెలతో గిన్నిస్ రికార్డ్ వంటి వివరాలెన్నో అబ్బురపరిచాయి. బాస్కెట్ బాల్ పాప(క్వియాన్ హొంగియాన్ క్వియాన్) ఉదంతం స్పందింపచేసింది. బాలనేస్తాలులో నిఖత్ ఖాతున్ గీసిన చిత్రం బావుంది. తనకి అభినందనలు. ముట్టుకున్నాడు కథ బాగుంది. నవ్వుల్ పువ్వుల్ చెణుకులన్నీ హాయిగా నవ్వింపచేసాయి. చూద్దామా త్రిపుర విశేషాలు కూలకషంగా తెలుసుకోగలిగాం. గని సీరియల్ ఉత్కంఠ తగ్గకుండా కొనసాగుతోంది. కొంటే బంగారం.. ధరల భయం! కొని దాచుకుంటే దొంగల భయం! దాచుకుంటే పెళ్లీ సాంప్రదాయం పేర్న అల్లుడి స్వాహా భయం... మొత్తానికి మనలో మాట బంగారం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం

కళ్లకు కట్టారు

సెప్టెంబర్ 13 ఆదివారం స్నేహ సంచికలో కీకారణ్యం నల్లమల అభయారణ్యం పత్రికకు హైలెట్. పెద్ద పెద్ద అడవులనగానే ముందుగా వినిపించే పేరు నల్లమల అడవులు. ఈ అడవుల విశేషాలు చాలామందికి తెలియవు. అక్కడున్న కొండలు, లోయలు, విలువైన కలప, ఆ ప్రాంతంలో నివసించే చెంచుల జీవితాలు కళ్లకు కట్టినట్టు చెప్పారు. ధన్యవాదాలు.

ఎన్.ఎన్.ఆర్, హైదరాబాద్.

సీరియల్ బావుంటోంది

ఈ వారం రంజాన్ రుచులైన మటన్ బిర్యానీ, షీర్‌ఖుర్మా వంటలు చాలా బాగుండి సందర్భోచితంగా వున్నాయి. స్ఫూర్తి శీర్షికలో ఎ.గాంధీ గారికి స్ఫూర్తినిచ్చిన పుస్తకం బాగుంది. పైగా అంత చిన్న వయసులో మార్క్స్ రాసిన వ్యాసమని తెలుసుకుని ఆశ్చర్యపోయాం. త్రిపురలో బీర్ చంద్రమాను ఊచకోతకు సజీవ సాక్షాలుగా నిలిచిన నిర్మాణాలను తెలుసుకున్నాం. అక్కడి ఆదివాసీలను చూసి నేర్చుకోవలసినవి, ఆచరించవలసినవి చాలా వున్నాయి. దేశంలో ప్రతి రాష్ట్రంలో అందరూ అలానే చేస్తే ఎంతో పురోభివృద్ధిని సాధించవచ్చు. బాలనేస్తాలుతో పిల్లలకు మంచి కాలక్షేపం అవుతోంది. సీరియల్ బాగుంటోంది.

రమ్య, సూర్యాపేట.

బాస్కెట్‌బాల్ పాపా! పద ముందుకు!!

ముస్లిం మిత్రులకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం ప్రత్యేకతను గురించి ఎన్నో వివరాలు చెప్పారు. ఏ దేశంలో ఏరకంగా ఈ పండుగను జరుపుకుంటారో, వారి ప్రత్యేక వంటల గురించి చెప్పడం బాగుంది. తెల్సాలో సీమరేగుపండ్ల కథనం బాగుంది. కథలో పల్లెటూళ్లలోనే కాదు పట్టణాలలో కూడా నేటికీ ఇంకా ఇలాంటి మూఢాచారాలతో, అజ్ఞానంతో మగ్గిపోయేవాళ్లు చాలా మందే వున్నారు. ఎప్పటికైనా వీరిలో మార్పు వస్తుందేమో ఎదురుచూడాల్సిందే. సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. బంగారం రేటు చూసి జనం భయపడి పారిపోయేలా వుంది. ఇకనుండి బంగారం కొనడానికి కాదు చూడ్డానికే పరిమితమయ్యేట్టుంది. చివరి పేజీలోని బాస్కెట్ బాల్‌పాప గురించి చదివితే అనిపిస్తుంది ఎలా ఇంత ధైర్యంగా వుందా అని. నిజంగా ఆపాపకి హేట్సాఫ్ చెప్పాలి.

జంషీదా,
నాగారం, హైదరాబాద్.



గొప్ప స్ఫూర్తి

మీరు స్ఫూర్తి కాలం ద్వారా కొంతమంది అనుభవాలు, ఏ రచనల స్ఫూర్తి ద్వారా వారు ఉద్యమకారులుగా మారి ప్రజల కోసం పనిచేస్తున్నారో తెలియజేస్తున్నారో వివరిస్తున్నందుకు ధన్యవాదాలు. పీకాక్ క్లాసిక్ సంపాదకుడు ఎ.గాంధీ ఏ వృత్తిని స్వీకరించాలి, ఎందుకు స్వీకరించాలి అన్న కారల్ మార్క్స్ రాసిన ఆరు పేజీల వ్యాసాన్ని చదివి స్ఫూర్తి పొందడం గొప్ప విషయం. ఉద్యమ కారులను చైతన్య పరిచే విధంగా స్ఫూర్తి శీర్షిక కొనసాగించవలసిందిగా కోరుతున్నాము. ఆరోగ్యానికి సంబంధించిన శీర్షికలో శరీర అవయవాల రోగాలకు సంబంధించిన అంశాలు తప్పక తెలియజేయాలని కోరుతున్నాము.

టి. శ్రీరామమూర్తి, గాజువాక,
విశాఖ.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

దూరం నుండే దాడిచేసే జీవులు

తమ శత్రువులపై కొన్ని జీవులు ప్రత్యక్షంగా దాడిచేస్తాయి. అయితే దూరం నుండే శత్రువులపై దాడిచేసే జీవులు కొన్ని వున్నాయి. వాటిలో విషాన్ని చిమ్మే కోబ్రా, కళ్ళ నుండి రక్తాన్ని చిమ్మే కొమ్ముబల్లి, చెడువాసన వచ్చి ఒకరకమైన నూనె వంటి ద్రవాన్ని చిమ్మే ఫల్మర్ పక్షిని గురించి ప్రధానంగా చెప్పుకోవచ్చు. అందులో కోబ్రా తాను భక్షించే జీవుల కళ్ళలోకి విషాన్ని చిమ్మి వాటిని చంపుతుంది. చాలా రకాల చిన్న చిన్న జంతువులకు కూడా ఈ విషం ప్రాణాంతకమని చెప్పవచ్చు.



అలాగే మనుషులకు సైతం ఇవి అత్యంత బాధాకరంగా పరిణమిస్తుంది. కొన్ని సందర్భాలలో చూపు కూడా పోతుంది. కొమ్ము బల్లులని పిలవబడే ఒకరకమైన బల్లులు ఉత్తర అమెరికాలోని ఎడారి ప్రాంతాల్లో కన్పిస్తాయి. ఇవి ఇంచుమించు ఒక మీటరు దూరం నుండే తమ శత్రువులను భయపెట్టడానికి కళ్లనుండి రక్తాన్ని ధారగా చిమ్ముతాయి. అలాగే ఫల్మర్ అనే పక్షి తనను వేటాడే వేటగాళ్ల నుండే రక్షణ కల్పించుకునేందుకు ఒకరకమైన చెడువాసన వచ్చే నూనె వంటి ద్రవాన్ని చిమ్ముతుంది.



తొలి శవపరీక్ష

కలకత్తాలోని మెడికల్ కాలేజిని 1835 వ సంవత్సరం, జనవరి 28వ తేదీన ప్రారంభించారు. ఆ రోజులలో శవాన్ని తాకడం తప్పుగా భావించేవారు. కళాశాలలో శరీర నిర్మాణం అంతర్భాగాలను గురించి పాఠాలు చెప్పే సమయంలో చార్టు గీసిన బొమ్మలను మాత్రమే చూసేవారు విద్యార్థులకు పాఠాలు బాగా అర్థం కావాలంటే 'శవాన్ని తాకడం తప్పు' అనే భావన తొలగించడం అవసరమని కాలేజిలోని పండిట్ మధుసూదన్ గుప్త, డాక్టర్ గుడీవ్ భావించారు. అందుకోసం వారు ఒక రోజున అయిదుగురు విద్యార్థులను రహస్యంగా కాలేజి దగ్గరలో ఒక ఇంటికి తీసుకువెళ్ళారు. అక్కడ మధుసూదన్ గుప్త తొలిసారిగా శవ పరీక్ష చేస్తూ శవాన్ని తాకుతూ విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఆ అయిదుగురు విద్యార్థులు మరిచిపోలేని అనుభవాన్ని పొందటం, ఆ తర్వాత మిగిలిన విద్యార్థులు కూడా శవ పరీక్షలకు ముందుకు రావడంతో శవ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

ఆరువేళ్ల గ్రామం

స్పెయిన్‌లోని సెర్వెరా డిబూట్రగో అనే గ్రామానికి ఆరువేళ్ల గ్రామమని పేరు. ఈ గ్రామంలో ఇంచుమించు అందరికీ ఒక్కొక్క చేతికి ఆరు లేదా అంతకన్నా ఎక్కువ వేళ్లున్నాయి. మనకు ఎవరన్నా అరుదుగా ఆరువేళ్ళున్న వారు కనిపిస్తే మనం జన్యుపరంగా ఏదో లోపం ఉందని భావిస్తాం. అయితే అక్కడ ఐదువేళ్లతో ఎవరన్నా కనిపిస్తే అతనిలో ఏదో జన్యుపరమైన లోపం వుందని భావిస్తారు. కుడిచేతికి ఆరువేళ్లతో జన్మిస్తే వారు అదృష్టవంతులని పాశ్చాత్య దేశాల పురాతన నమ్మకం. అదే ఎడమ చేతికి ఆరువేళ్లతో జన్మిస్తే వారు దురదృష్టవంతులని నమ్ముతారు. ఇంగ్లండ్ రాజు ఎనిమిదవ హెన్రీ రెండవ భార్యకు ఎడమ చేతికి ఐదు వేళ్లుండడం, ఆమెను ఉరితీయడం వారి నమ్మకాలకు మరింత ఊతాన్నిచ్చింది.

తెలుసా!

చిత్రమైన నమ్మకం

పిల్లి ఎదురైతే ప్రయాణాన్ని మానేసే వారిని, తుమ్మగానే చేస్తున్న పనిని ఆపివేసి చతికిల పడేవారిని మనం చూస్తూనే వున్నాం. ఇటువంటి వారిలో మధ్య ప్రదేశ్‌లోని ఘుజియా జాతివారిలో ఒక వింత మూఢనమ్మకం వ్యాప్తిలో ఉంది. దగ్గరలో ఏదైనా గుడ్లగూబ వుండగా తమ వారినెవరినీ పేరు పెట్టి పిలవరు. ఎందుకంటే ఆ పేరును గుడ్లగూబ గుర్తుంచుకొని దానిని పదే పదే పలకడం ద్వారా ఆ పేరు గల వారి చావుకు కారణమవుతుందని వారి నమ్మకమట.

డి.పాపారావు
మార్క్సిస్టు మనో విశ్లేషకులు

కదిలించిన శౌర్యగాథ మదివెలిగిన అరుణతార

నేను పుట్టింది గుంటూరు జిల్లా చేబ్రోలులో, పెరిగింది చదువు అంతా గుంటూరులోనే. మానాన్న నాగేశ్వరరావు – మంచి కమ్యూనిస్టు. శ్రమజీవి. మా అమ్మ పార్వతి ఉపాధ్యాయురాలు. వామపక్ష భావజాలం ఉన్న కుటుంబంలో పుట్టడం వల్ల చిన్నతనం నుంచే వామపక్ష పత్రికల అధ్యయనం అలవడింది. వామపక్ష నేతలను కొందరిని దగ్గరగా గమనించే వీలుపడింది. అలా బాల్యంలో ఏర్పడిన ఆ దృక్కోణమే తొలి అధ్యయనానికీ, దాని కొనసాగింపుకూ ప్రేరణగా నిలిచింది. అయితే, ఉద్యమాలతో ఉన్న నా బంధం ప్రధానంగా పుస్తకాల ద్వారానేనని చెప్పాలి. ఆ పుస్తకాలలో నాపై ముద్ర వేసింది... నాటి సోవియట్ యూనియన్ రచయిత సెర్గీయ్ స్మిర్నోవ్ "బ్రెస్ట్ దుర్గ వీరులు" నవల. రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ అనామక వీరుడి సాహసగాథ ఇది. ఈ పుస్తకాన్ని నా 13వ ఏట 8వ తరగతిలో గుంటూరు ప్రాంతీయ గ్రంథాలయంలో చదివాను. అది నాపై కలిగించిన ప్రేరణ అసామాన్యమైనది. ఆ స్ఫూర్తి ఇప్పటికీ జీవితంలో అంతశ్చేతనగా ఉంటుంది.

"బ్రెస్ట్ దుర్గ వీరులు" నవలలోని అనామక వీరుడు దుర్గంలోనే పదినెలలు ఒంటరిగా గడుపుతాడు. జర్మన్ సేనలతో అలుపులేని పోరాటం చేస్తాడు. చివరకు మందుగుండు పూర్తిగా అయిపోతుంది. తరువాత తన తోటి సోవియట్ దేశీయుడు ఒక సంగీతకారుడిని జర్మన్లు బెదిరించి తనను దుర్గంలో నుంచి బయటకు తెచ్చేందుకు పంపిస్తారు. అప్పుడు వెలుపలికి వచ్చిన అతని అపూర్వ ధైర్యసాహసాలకు విభ్రాంతి చెంది, చూస్తూ నిలుచున్న జర్మన్ నాజీలు 'కోటలో ఇంకా ఎవరైనా వున్నారా?' అని ప్రశ్నించినపుడు "లేరు" అంటూనే ఆయన చెప్పిని జవాబు మరువలేనిది. "నేనొక్కడ్నే, రష్యాలో మీరు ఎంతటి అసహాయ స్థితిలో వున్నారో చూడానికి వెలుపలికి వచ్చాను..." అంటాడు.

నాకు తెలియకుండానే నాలో మొదటి నుంచీ ఏటికి ఎదురీదే లక్షణం ఉందనుకుంటాను. బహుశా – "బ్రెస్ట్ దుర్గ వీరులు" పుస్తకంలోని సోవియట్ అనామక వీరుడు జర్మన్ సైన్యంతో జరిపిన ఒంటరిపోరు దీని వెనుక వున్న ప్రేరణ కావచ్చు. బెల్‌బాటమ్స్ రోజుల్లో నేరో ప్యాంటుతో తిరిగినా, కాలేజీలో ధనవంతుల బిడ్డలతో కలిసి ఆటలు ఆడినప్పుడు కూడా వాళ్ళతో అంటీ ముట్టనట్లుగానే వున్నా– బియస్సీ చదువుతుండగా క్లాస్ రిప్రెజెంటేటివ్‌గా పోటీ చేసి, ప్రత్యర్థులు కార్లు, స్కూటర్లపై జట్టుగా ప్రచారం చేస్తోంటే – ఒంటరిగా సైకిల్‌పై ప్రచారం జరిపినా... వాటన్నిటి వెనుక కూడా బ్రెస్ట్ దుర్గంలో ఒంటరిగా నాజీ జర్మన్ సైన్యాలతో 10 నెలలు పోరాడిన ఆ అనామక వీరుడి నేపథ్యం ఉండవచ్చు.

నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎం.బి.ఏ చదువుతుండగా విద్యార్థి యూనియన్ ఎన్నికలలో అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేసి కులరాజకీయాలతో రాజీపడకుంటే ఓడిపోతానని తెలిసీ సైద్ధాంతిక పోరాటం కొనసాగించగలిగేలా నన్ను నడిపించింది. "ఎవరేమన్ననూ... తోడు రాకున్ననూ... ఒంటిరిగానే సాగిపోరా ..." అన్న ఆ బ్రెస్ట్ దుర్గవీరుడి పోరాట స్ఫూర్తితోనే నా మార్గాన్ని కలంతో చేసే పోరాటంగా ఎంచుకున్నాను. ఎనిమిదవ తరగతి నుంచీ డిగ్రీ మొదటి సంవత్సరం దాకా కవిత్వం రాశాను. అనంతరం కావాలనే కవిత్వం రాయడం మానేసాను. నాలో

నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎం.బి.ఏ చదువుతుండగా విద్యార్థి యూనియన్ ఎన్నికలలో అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేసి కులరాజకీయాలతో రాజీపడకుంటే ఓడిపోతానని తెలిసీ సైద్ధాంతిక పోరాటం కొనసాగించగలిగేలా నన్ను నడిపించింది. "ఎవరేమన్ననూ... తోడు రాకున్ననూ... ఒంటిరిగానే సాగిపోరా ..." అన్న ఆ బ్రెస్ట్ దుర్గవీరుడి పోరాట స్ఫూర్తితోనే నా మార్గాన్ని కలంతో చేసే పోరాటంగా ఎంచుకున్నాను.



ఆలోచనలకన్నా ఆవేశం పాలును కవిత్వం రాయడం పెంచుతోందనిపించడందానికి కారణం. ఇప్పటికీ సాహిత్యం, కవిత్వంపై మక్కువలేదు. కవులలో నేను అభిమానించేది అతి కొద్ది మందినే. సాహిత్యాన్ని కొద్దిగా మాత్రమే చదివాను. సాహిత్యంతో నాకున్న కొద్దిపాటి పరిచయం కూడా నా చుట్టూ వున్న వామపక్ష మిత్రులతో నవలా సాహిత్యం గురించి చర్చిస్తుండగా ఏర్పడినదే.

నాకు, సైద్ధాంతిక అధ్యయన మార్గదర్శనం కలిగింది 1974లో. నేను ఇంటర్మీడియట్ తొలి సంవత్సరంలో వామపక్ష విద్యార్థి ఉద్యమంలో పనిచేయడం మొదలు పెట్టడం దానితో పాటుగా నా తొలి వామపక్ష నేస్తాల పట్టుదల, దీక్షా.. అదే కాలంలో సోవియట్ పుస్తకాల పాత్ర గురించి ప్రస్తావించకుండా వుండలేను. నాడు సోవియట్ యూనియన్ నుంచి కారుచౌకగా, విస్తారంగా కమ్యూనిస్టు సాహిత్యం విశాలాంధ్ర పుస్తకాల దుకాణానికి వచ్చేది. పుస్తకాల దుకాణంలో (గుంటూరులో) మేనేజర్‌గా వున్న బాబూరావుగారు నన్ను ప్రత్యేకంగా ప్రేమించి ఒక్కోమారు క్రెడిట్‌కు కూడా పుస్తకాలు ఇచ్చేవారు. ఇక, అలాగే నాడు కాలేజీలో క్విజ్ టీంలో, డిబేటింగ్ టీంలో వుండడం వెనుక కూడా వామపక్ష విద్యార్థి ఉద్యమ నేపథ్యం వుంది. ఈ అధ్యయనాల కోసం గుంటూరులోని ఎ.సి కాలేజీ ఎదురుగావున్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో బాగా సమయం గడపడం... రాత్రిళ్ళు మిత్రులతో చర్చిస్తూనో, చదువుకుంటూనో, తెల్లవార్లూ గడపడం అప్పుడు అలవాటైంది. మెడికల్ ఎంట్రెన్సుకు చదివే పేరుతో కూడా లెనిన్ రచనలు చదివాను. కమ్యూనిస్టు వ్యతిరేక వాదనలనూ, పుస్తకాలనూ జాగ్రత్తగా అధ్యయనం చేయడం కూడా బాగా అలవాటు. ఆరకంగా మాత్రమే మనం ఈ ప్రపంచంలో గట్టిపడగలమనే విశ్వాసం మొదటి నుంచీ నాలో ఏర్పడింది.

బహుశా 1991లో సోవియట్ పతనం అనంతరం కొందరు వామపక్ష మిత్రులూ, అభిమానులూ 'ఇంకేముంది... అంతా అయిపోయింది' అనుకున్నప్పుడు కూడా... అరుణపతాకాన్ని చేజారకుండా కాపాడుకునే ధైర్యాన్ని మనలోని పలువురిలో నింపింది. చాలా మేరకు ప్రజలపట్ల, వారి అపూర్వ ధైర్యసాహసాలు, కష్టాలు, కన్నీళ్లు, కడగండ్ల కథలేనన్నదీ దానితో పాటుగా మనలో అంతర్గత శక్తినీ పెంపొందించి, ప్రేరేపించగలిగిన అధ్యయనం మాత్రమేననేది నాకు చెరగని విశ్వాసం. యువ కమ్యూనిస్టు లీగ్ సభ్యులతో మాట్లాడుతూ లెనిన్ పేర్కొన్న మాటలు ఇక్కడ గమనార్హం..." ప్రత్యేకించి యువజన కమ్యూనిస్టు సంఘాలు... కర్తవ్యాలను "నేర్చుకోవడం" అనే ఒక్క మాటలో క్రోడీకరించవచ్చునని నేను చెప్పాలి.. సహజంగా, మొట్టమొదట తోచే ఆలోచన ఏమిటంటే, కమ్యూనిజం నేర్చుకోవడం అంటే కమ్యూనిస్టు పుస్తకాలలో వుండే మొత్తం జ్ఞానాన్ని జీర్ణం చేసుకోవడమని. కానీ, అలాంటి నిర్వచనం మరీ మొరటుగా అరకొరగా వుంటుంది... (అది) మాత్రమే కమ్యూనిజం అధ్యయనమైతే, మనకు పార్య గ్రంథపు గారడీ వాళ్ళూ, కోతల రాయుళ్ళూ మరీ సులభంగా లభించవచ్చు. ఇది అతి తరచుగా మనకు హానిచేస్తుంది... పని లేకుండా, పోరాటం లేకుండా.. సంపాదించిన పుస్తకజ్ఞానం బొత్తిగా జీర్ణం చేసుకోవడానికి పూనుకోవడం ఇంకా ప్రమాదకరంగా ఉంటుంది.. మానవజాతి రాసిపోసిన జ్ఞాన సంపదను జీర్ణం చేసుకోకుండా కమ్యూనిస్టు కావచ్చుననేది... (తీవ్రమైన పొరపాటు)... కమ్యూనిజం దేని ఫలితమో ఆ జ్ఞానం మొత్తాన్ని సంగ్రహించుకోకుండా, కమ్యూనిస్టు నినాదాలనూ... నేర్చుకుంటే చాలునని అనుకోవడం పొరపాటు..."

మధ్యతరగతి నుంచి వామపక్ష ఉద్యమంలోకి వచ్చిన వాడిగా నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానంలో ఈ వర్గం వారు ఉద్యమంలో ప్రధానంగా సాగించవలసిన ప్రస్థానం – ఆత్మవిమర్శ ద్వారా సాగే అన్యవర్గ ధోరణిని అధిగమించే అంతర్ముఖ మానసిక ప్రస్థానం. ఈ విషయంలో జిడ్డు కృష్ణమూర్తి వారి వంటి రచనలు మనకు కొంత మేరకు సాయపడతాయి. అయితే ఆ రచనల పరిమితిని మరువరాదు. దీనంతటినీ మించి మార్క్స్, లెనిన్‌లు మధ్యతరగతి వర్గపు స్వభావం గురించి ఇచ్చిన వివరణలు మనకు ప్రాతిపదికగా ఉంటాయి. మధ్యతరగతి వర్గ ధోరణులపై మనం చేసుకునే మానసిక అంతర్ముఖ, ఆత్మ విమర్శనా పూరిత యుద్ధం మాత్రమే మనను కెరీరిజం, అహంకార ధోరణులు... వంటి ఇతరేతర అన్యవర్గ ధోరణుల నుంచి పూర్తిగా ప్రక్షాళన చేయగలదు. లేకుంటే, మనం వ్యక్తులుగా నిర్మించుకునే భావజాల పునాదిలోనే డొల్లతనం నెలకొనే అవకాశం ఉంది. ఎందుచేతనంటే ఇతరేతర వర్గాల నుంచి కార్మికవర్గ పార్టీలోకి వచ్చినవారు.. మొదటగా ఆ అజెండాను ప్రక్షాళన చేసుకోవాలి. లేకుంటే వారు మార్క్సిస్టు అధ్యయనంతో శక్తివంతమైనప్పటికీ.. తమ మేధస్సు ద్వారా... రెట్టించిన బలంతో... అన్యవర్గ అజెండానే.. ఎర్రజెండా నీడలో అమలు చేసే ప్రమాదముంటుంది.

అంతిమంగా, నేను చెప్పగలిగేది ఒక్కటే. కమ్యూనిస్టు ఉద్యమానికి నేను కొద్దిగానైనా సేవ చేశాను.. కానీ అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువగా ఉద్యమం నా మానసిక ఘర్షణలు, ప్రాపంచిక ఘర్షణలలోనూ, నాకు ప్రపంచం పట్ల స్పష్టతను (ఎంతో కొంత) ఇవ్వడం ద్వారా నాకు మంచి చేసింది. నేను చేసిన "త్యాగం" కంటే కార్మిక వర్గ



నాకు తెలియకుండానే నాలో మొదటి నుంచీ ఏటికి ఎదురీదే లక్షణం ఉందనుకుంటాను. బహుశా - "బ్రెస్ట్ దుర్గ వీరులు" పుస్తకంలోని సోవియట్ అనామక వీరుడు జర్మన్ సైన్యంతో జరిపిన ఒంటరిపోరు దీని వెనుక వున్న ప్రేరణ కావచ్చు. బెల్‌బాటమ్స్ రోజుల్లో నేరో ప్యాంటుతో తిరిగినా, కాలేజీలో ధనవంతుల బిడ్డలతో కలిసి ఆటలు ఆడినప్పుడు కూడా వాళ్ళతో అంటీ ముట్టనట్లుగానే వున్నా- బియస్సీ చదువుతుండగా క్లాస్ రిప్రెజెంటేటివ్‌గా పోటీ చేసి, ప్రత్యర్థులు కార్లు, స్కూటర్లపై జట్టుగా ప్రచారం చేస్తోంటే - ఒంటరిగా సైకిల్‌పై ప్రచారం జరిపినా... వాటన్నిటి వెనుక కూడా బ్రెస్ట్ దుర్గంలో ఒంటరిగా నాజీ జర్మన్ సైన్యాలతో 10 నెలలు పోరాడిన ఆ అనామక వీరుడి నేపథ్యం ఉండవచ్చు.

త్యాగాల పతాక నాకు చేసిన మేలే ఎక్కువ. ఇదీ ఇప్పటి వరకూ నా జీవితపు జమా, ఖర్చుల పద్దు.. ఉద్యమానికి రుణపడి వున్నాను.. ఈ 50ఏళ్ళ జీవన ప్రస్థానంలో నేను చెప్పగలిగింది: పునాది శిథిలమై పతన దిశగా సాగుతోన్న పెట్టుబడిదారీ దుర్గపు గోడలపై మరింత రెట్టించిన ఉత్సాహంతో ఆచరణాత్మక పోరాటంతో పాటు నేటితరం కమ్యూనిస్టులు సైద్ధాంతిక మరఫిరంగులకు అధ్యయనం అనే మందుగుండును ఇచ్చిపేల్చే మేలు కలయిక.. ఇది నేటి ప్రగాఢమైన అగత్యం.. చారిత్రక అవసరం. బ్రెస్ట్ దుర్గవీరులు వంటి శౌర్యగాథలు కూడా అందుకు మనను ఉత్తేజపరుస్తాయి. ★

జోగిపేట క్లాక్ టవర్

ఘన చరిత్ర కలిగిన నిర్మాణాలు అక్కడక్కడ శిథిలమై కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మరికొన్ని కట్టడాలు ఆదరణకు నోచుకోకుండా ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్నాయి. ఆ కోవకు చెందినదే సంగారెడ్డిలోని జోగిపేట 'క్లాక్‌టవర్'.



ఇది పట్టణం నడిబొడ్డున దర్శనమిస్తుంది. 1963లో అప్పటి 5వ నిజాం నవాబు అఫ్జలుద్దౌలా ఈ క్లాక్ టవర్‌ను నిర్మించారు. ఇది పంచకోణాకృతిలో వుంటుంది. చివరి భాగంలో అంటే పైన ప్రజల సౌకర్యార్థం సమయాన్ని సూచించే గడియారాలను అమర్చారు. గడియారాలను నలువైపుల ఏర్పాటు చేయడం వల్లే దీనికి 'క్లాక్ టవర్' అనే పేరు వచ్చిందని పుర్వీకులు చెబుతున్నారు. ఈ టవర్ పైభాగం వరకు వెళ్లడానికి మెట్లను కూడా ఏర్పాటు చేశారు. 5వ నిజాం నవాబు నుండి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ వరకు గడియారాల నిర్వహణ సక్రమంగా ఉండేది. ప్రజలు వారి హయాంలోనే గడియారాలను వినియోగించుకున్నారు. జనాలు సమయం తెలుసుకోవడానికి ఈ టవర్ ఎంతగానో ఉపయోగపడేది. దీనిపట్ల నిజాం నవాబులు ప్రత్యేక శ్రద్ధ చూపించేవారని చరిత్రను బట్టి అర్థమవుతోంది. క్లాక్‌టవర్ నిర్వహణ కోసం కొంత మంది పర్యవేక్షకులను నియమించారు. అప్పట్లో టవర్‌లోని గడియారాల గంటల మోత పరిసర ప్రాంతాల్లో ప్రతిధ్వనించేది. ఆ సూచనతో ప్రజలు సమయం ఎంతైందో తెలుసుకునే వారు. దాని ప్రకారం తమ పనులు కొనసాగించేవారు. సమయం సూచించడానికి ప్రజలకు వినిపించే విధంగా ఫిరంగులను పేల్చేవారు. రోజుకు మూడు సార్లు ఫిరంగులు పేల్చుతూ ప్రజల దైనందిన జీవితంలో వారి పనులను గుర్తు చేసేవారు. తోపు పేల్చే వ్యక్తి ముందుగా ఫిరంగిలో మందు దట్టించి, దాని పక్కన గంట నీటి కొలనులోకి దిగి నిప్పు సహాయంతో పేలుడు మందును అంటించి వెంటనే నీటిలో మునిగేవాడు. దీంతో ఫిరంగి ద్వారా వెలువడే శబ్దం నుండి అతనికి ఎటువంటి ఇబ్బంది వుండేదికాదు. ఈ విధంగా పేల్చే ధ్వని పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వినిపించేది. తెల్లవారుజాము 4గంటలకు ఒక సారి పేల్చి ప్రజలను నిద్రలేపి తమ పనులను గుర్తుచేసేవారు. మధ్యాహ్నం 12గంటలకు భోజనం కోసం, రాత్రి 8గంటలకు నిద్రపోయేందుకు ధ్వని ద్వారా ప్రజలకు సూచించేవారని తెలుస్తోంది. ఈ సంప్రదాయం నిజాం నవాబుతోనే అంతరించింది. ప్రస్తుతం క్లాక్‌టవర్ నాలుగు దిక్కులా ఉన్న గడియారాలు మనుగడలో లేవు. లోపల మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు వైపులా విద్యుత్ దీపాలను అలంకరించారు. కాని అవి సరిగా వెలగటం లేదు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన పురాతన కట్టాడానికి గల గడియారాలను ప్రభుత్వమే బాగుచేయించాలి.

- గడ్డమీది సంతోష్

ఇన్నేళ్లైనా లైసెన్సు రాకపోతే!

నాకు తూనికలు-కొలతల లైసెన్సు ఉంది. 1987 సంవత్సరం నుండి రాళ్లు, కాటాలు అమ్మకం పనిచేస్తున్నాను. 2002లో ఆ లైసెన్సును రెన్యువల్ కోసం పంపాను. కానీ ఇప్పటి వరకూ పంపలేదు. ఈ విషయంమీద ఎవరికి ఫిర్యాదు చేస్తే మంచి స్పందన వస్తుందో దయచేసి చెప్పగలరు?

ఎస్.ఎ.కరీమ్, తెనాలి.

తూనికలు-కొలతల చట్ట ప్రకారం మీరు ప్రతి సంవత్సరమూ లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలి. మీరు '2002లో ఇచ్చాను. ఇప్పటివరకూ లైసెన్సు పంపివ్వలేదు' అంటున్నారు. ఇన్ని సంవత్సరాలు లైసెన్సు లేకుండా మీరు ఎలా నడిపించారు. లైసెన్సు లేకుండా నడిపించడం నేరమవుతుంది. మీరు వారికిచ్చినట్లు రశీదు ఉందా? లేదంటే వెంటనే మరియొక దరఖాస్తు పెట్టుకుని తీసుకోండి. దాంట్లో ఏం జరిగిందో సవివరంగా రాయండి. వారి వద్ద పోయి ఉన్నా, మీ వద్ద పోయినా ఏమైనా జరిగితే నష్టం మీకే. కావున వెంటనే అర్జీ పెట్టుకోండి. వాళ్లే ఇవ్వనట్లయితే హైకోర్టును ఆశ్రయించవచ్చు.

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్, హైదరాబాద్

మేజర్ అని ఎవరిని అంటాం?

ఒక వ్యక్తికి 18 సంవత్సరాలు దాటితే మేజర్ అంటున్నారు. ఓటు కూడా వేయడానికి అర్హత ఉంది. కాని ముస్లిం చట్ట ప్రకారం ఎన్ని సంవత్సరాల వయస్సులో ఆస్తి కొనే హక్కు వస్తుంది? మేజర్ అంటే ఏమిటో తెలియజేస్తూ, మేజర్ సొంతంగా ఆస్తి కొనవచ్చునా అనే విషయం తెలియజేయండి.

-కిజర్, ఏలేరు.

ఇండియన్ మేజర్ ఆక్ట్ ప్రకారం ప్రతి 18 సంవత్సరాలు నిండిన పౌరుడు మేజర్‌గా గర్తించబడతాడు. ఆ చట్టం ప్రతి భారతీయుడికీ వర్తిస్తుంది. అది మతాలకతీతం. కావున ముస్లిం అయినా, హిందూ అయినా ఆ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండితే మేజర్ అయినట్టే. అది పురుషులైనా, స్త్రీలైనా ఒకే విధంగా ఉంటుంది. వర్తిస్తుంది.

★

మొఘల్ రైస్

కావలసిన వస్తువులు

పలావు బియ్యం - 2 కప్పులు,
ఉల్లిపాయలు - 2,
నెయ్యి - 4 స్పూనులు,
వెల్లుల్లిపాయ - 1 (చిన్నది),
యాలకులు - 8, లవంగాలు - 8,
కరివేపాకు - 2 రెమ్మలు,
మిరియాల పొడి - 2 స్పూన్లు, బాదం పప్పు - 5

తయారు చేసే విధానం

బియ్యం కడిగి గంట సేపు నాననివ్వాలి. ఉల్లిపాయలు, వెల్లుల్లిని ముక్కలుగా కొయ్యాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి నెయ్యి పోసి కాగనివ్వాలి. ఉల్లిపాయ, వెల్లుల్లి ముక్కలు వేసి వేయించాలి. వేగాక మిరియాల పొడి, యాలకుల పొడి, లవంగాలు, కరివేపాకు వేసి వేయించాలి. తర్వాత బియ్యం పోయాలి. దానిలో నీరు పోసి మధ్య, మధ్యలో కలియ బెడుతూ ఉండాలి. బియ్యం ఉడికాక దించేసి మరొక గిన్నెలోకి వంచుకొని పైన బాదం పప్పు ముక్కలు చల్లుకోవాలి.

మిల్క్ రైస్

కావలసిన వస్తువులు

అన్నం - 2 కప్పులు,
కొబ్బరి పాలు - 1 కప్పు,
నెయ్యి - 2 స్పూన్‌లు,
జీడిపప్పులు - 10,
యెండు ద్రాక్ష - 15 గ్రాములు,
యాలకులు - 5,
చక్కెర - 1/4 కప్పు.

తయారుచేసే విధానం

అన్నానికి కొబ్బరి పాలు, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. నెయ్యిలో జీడిపప్పు, యెండు ద్రాక్ష వేసి వేయించాలి. అవి వేగాక కొబ్బరిపాలు కలిపిన అన్నం వేసి సన్నని సెగ మీద పెట్టాలి. చక్కెర యాలకుల పొడి వేసి మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. అడుగంటనీయకూడదు. కొబ్బరి పాలు మొత్తం ఇంకి పోయాక అన్న పొడిపొడిగా ఉవ్వప్పుడు దించుకోవాలి.


మొఘల్ రైస్ | టమాటో పలావ్ | మిల్క్ రైస్ | గ్రీన్ రైస్

టమాటో పలావ్

కావలసిన వస్తువులు

బియ్యం - 1/2 కిలో, కొబ్బరి చిప్ప - 1, పచ్చిమిర్చి - 8, టామోటాలు - 1/4 కిలో, ఉల్లిపాయలు - 5, అల్లం ముక్క -1, ఎండుమిర్చి -10, లవంగాలు - 8, దాల్చినచెక్క ముక్కలు - 2, మెంథాల్ - 10 గ్రాములు, డాల్డా - 200 గ్రా.

తయారుచేసే విధానం

బియ్యం కడిగి ఒక బుట్టలో వేయాలి. టమాటాలు, కొబ్బరి కోరు, ఎండు మిర్చి, అల్లం ఒక బాండీలో నూనె లేకుండా వేయించి మెత్తగా రుబ్బుకొని ఒక గిన్నెలో పెట్టాలి. గిన్నెలో డాల్డా వేసి మషాలా దినుసులన్నీ వేసి బాగా వేగనివ్వాలి. తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఆరబోసిన బియ్యాన్ని కూడా బాగా వేయించాలి. ఇందులో మనం రుబ్బిన ముద్ద వేసి కలపాలి. మనం తీసుకొన్న బియ్యానికి ఒకటికి రెండింతలు నీరు.... తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. పుదీనా ఆకులను పైన వేసి మూత పెట్టాలి. దీన్ని కుక్కర్‌లో పెట్టి ఉడకనివ్వాలి. టమాటో పలావ్ రెడీ.

గ్రీన్ రైస్

కావలసిన వస్తువులు

ఆకు కూర (ఏదైన) - 1 కట్ట, ఉల్లిపాయలు - 2, నెయ్యి - 1/4 కప్పు, పచ్చిమిర్చి - 4, దాల్చిన చెక్క - 1, ఉప్పు - సరిపడా, అన్నం - 2 కప్పులు.

తయారు చేసే విధానం

ఆకు కూరను కడిగి, సన్నగా తరిగి, రోట్లో వేసి బాగా మెత్తగా రుబ్బాలి. ఇందులోంచి నుంచి ఒక కప్పు మాత్రమే తీసుకోవాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయల్ని సన్నగా తరుగుకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి, నెయ్యి పోసి, కాగిన తరువాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, దాల్చిన చెక్క వేసి వేయించాలి. వేగాక ఆకు కూర ముద్దవేసి బాగా కలిపి ఉప్పు వేసి మూత పెట్టాలి. ఉడికిన తరువాత నెయ్యి పైకి తేలుతుంది. అపుడు అన్నం వేసి 2,3, నిమిషాల పాటు పొయ్యి మీద ఉంచి, దించుకోవాలి. కావలిస్తే వేయించిన జీడిపప్పు కూడా కలుపుకోవచ్చు.

★



మనం ఎన్నో పార్కులు, తోటలు చూసుంటాం. వాటిలో బోలెడన్ని కళాఖండాలు మనకు తారసపడుంటాయి. కానీ...చండీఘర్‌లోని 'రాక్ గార్డెన్' రూటే వేరు. లోపలికి అడుగుపెట్టిన మరుక్షణం నుంచి తిరిగి బయటికి వచ్చేంత వరకు గుంపులు గుంపులుగా కొంగలు, బాతులు, కోతులు, జంతువులు, ఆడవాళ్లు, మగవాళ్లు రకరకాల హావభావాలతో మనకు కనిపిస్తారు. కప్పులతో కాఫీ తాగుతున్న మగవాళ్లు, నీళ్లకుండలు నెత్తిమీద పెట్టుకున్న మహిళలు, పిల్లలు, ఆరాంగా కూర్చుని సుదీర్ఘంగా ఆలోచిస్తున్న వాళ్లూ అగుపిస్తారు. ప్రతి ఒక్క కళాఖండమూ మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఎందుకంటే అవన్నీ పగిలిపోయిన, విరిగిపోయిన వస్తువులతో చేసినవి కాబట్టి. అలాంటి పార్క్‌లోని కళాఖండాలను సృజించింది ఒక్కరేనంటే నమ్మబుద్ధికాదు. మరి అంతగా ఆకట్టుకునే 'రాక్ గార్డెన్' విశేషాలను ఈ వారం తెల్సుకుందాం.

అన్నీ... వ్యర్థాలతో సృజించిన కళాఖండాలే

'రాక్ గార్డెన్' ఒక అద్భుతమైన పార్కు. ఇది హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు రాజధాని అయిన చండీఘర్‌లో వుంది. పాతిక ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ పార్కు సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ వేలరకాల మానవ, జంతు ఆకారాలను మనం చూడొచ్చు. అక్కడున్నంత సేపూ నిజమైన మానవులను, జంతువులను చూస్తున్న భావన కలుగుతుంది మనకు. ఇంకా ఇక్కడ అందమైన భవన ప్రాకారాలు, లోయలు, ప్రవాహాలు, వాటిని కలుపుతూ వింత దార్లు ఉన్నాయి.

వ్యర్థాలే ముడిసరుకు

వీటన్నిటికీ ముడిసరుకు పాడైపోయిన వస్తువులే. పగిలిపోయిన గాజులు, కప్పులు, సీసాలు, కుండలు, జాడీలు, బల్బుల ముక్కలు, బాగా కాలిన ఇటుకలు, పగిలిన కుండలు, చెట్ల బెరడు, గుడ్డపేలికలు, ప్లాస్టిక్ బొమ్మలు, పాడైపోయిన టోపీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పగిలిపోయిన రంగురంగుల గాజు ముక్కలు, వాడిన బూట్లు, కాలిపోయిన బల్బులు, పంచరైన టైర్లు, సీసాలు, పాడైన సైకిల్‌భాగాలు, పక్షి గూళ్ళు మొదలైన వాటితో చేసిన బొమ్మలు మనల్ని ఒక పట్టాన అక్కడి నుంచి కదలనివ్వవు.

ఎందరో సందర్శకులు

ప్రపంచంలోనే ఈ రాక్‌గార్డెన్‌కు అద్భుతంగా పేరు వచ్చింది. తాజ్‌మహల్ తర్వాత భారత్‌లో గొప్ప కళాత్మక నిర్మాణంగా దీనికి పేరు ఉంది. రోజుకు 5000 మంది ఈ గార్డెన్‌ను సందర్శిస్తున్నారు.

ఎన్నో కళాఖండాలు

పాడైపోయిన మెటల్, పింగాణీ పాత్రలు, కాంక్రీటుతో చేసిన భారీ బాతునూ, గాజుల అబ్బాయినీ మనమిక్కడ చూసి ఆనందించవచ్చు. చండీఘర్ రాక్‌గార్డెన్‌లో ఉన్న వాటిలో చెత్తతో చేసిన ఒక విగ్రహం అత్యంత అద్భుతంగా ఉంటుంది. ఇప్పుడిక్కడ సైకిల్ భాగాలు, కాంక్రీటుతో హిందూ దేవతలు, దేవుళ్లను నిర్మిస్తున్నారు. ఈ పార్కు ఎందరికో స్ఫూర్తిదాయకంగా వుంది. మొత్తంమీద చండీఘర్‌లో అడుగెట్టామూ అంటే మొట్టమొదట చూడాల్సిన పర్యాటక ప్రదేశం ఈ పార్కే.

సృష్టికర్త

మరి ఇంత అద్భుతమైన, అందమైన పార్కు సృష్టికర్త ఎవరో తెలుసా? నెక్ చంద్. ఈయన 1923లో జన్మించారు. ఆయనకు 23 సంవత్సరాలప్పుడు పంజాబ్‌లోని ఒక చిన్న గ్రామాన్ని విడిచిపెట్టి పాకిస్తాన్ ఇండియా సరిహద్దుకు చేరుకున్నారు. తర్వాత 1951లో చండీఘర్‌లో స్థిరపడ్డారు. ఈయన పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్‌లో రోడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. ఈయన మొదట్లో తన కోసం ఒక చిన్న పార్కుని ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నారు. దానికోసం



అడవిలో కొంత భాగాన్ని శుభ్రం చేశారు. ఆఫీసు పని పూర్తి కాగానే తన సైకిల్‌మీద వెళ్లి పనికిరాని వస్తువులు, వాడిపడేసిన, పగిలిపోయిన వస్తువులు, అందమైన చిన్న చిన్న రాళ్లు సేకరించేవారు. రాత్రి సమయాల్లో వీటిని పెద్దపెద్ద కళాఖండాలుగా మలిచేవారు. ఆ ప్రదేశం ప్రభుత్వ స్థలం కావడంతో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేవారు. కాని 1975లో అనుకోకుండా కొంతమంది దృష్టిలో పడింది. మెల్లగా ఆఫీసులో తెలిసింది. ప్రభుత్వం ఆయన ప్రతిభను చూసి ప్రోత్సహించింది. 1976లో పార్కుగా మారింది. ఆయన తన పూర్తి కాలాన్ని దీని కోసం వెచ్చించేందుకు జీతం కూడా నిర్ణయించి ఆయనకు సాయంగా 50 మందిని నియమించింది. భారత్‌లో గాక, విదేశాలలోనూ మిని రాక్‌గార్డెన్స్‌ను ఏర్పాటు చేయడానికి ఆయనను ఆహ్వానించారు. ఆయన చేశారు కూడా. అంతర్జాతీయంగా పేరుపొందిన ప్రదేశాలలో ఎగ్జిబిషన్‌లు నిర్వహించడానికీ ఆయనను పిలిచారు. జీవితాన్ని ప్రేమించేవారికి ఆయన స్ఫూర్తినిస్తారు. 'మంచి సంతోషకరమైన జీవితం గడపాలన్నా, జీవితంలో ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలన్నా మనకేది చేయడం ఇష్టమో దాన్ని ఉత్సాహంగా, పూర్తి ఏకాగ్రతతో చేస్తేసరి' అనేవారు పద్మశ్రీ చంద్.

విదేశాల్లోనూ అలరిస్తున్నాయ్!

ఆయన సృష్టించిన కళాఖండాలలో ఎక్కువ శాతం మన దేశంలోనే ఉన్నాయి. అయితే కొన్ని న్యూయార్కు నగరంలో అమెరికా ఫోక్ ఆర్ట్ మ్యూజియంలోనూ, విస్కన్సిన్, షెబోయ్‌గన్‌లోని జాన్ మైకేల్ కాలర్ ఆర్ట్ సెంటర్‌లోనూ, వాషింగ్‌టన్‌లోని నేషనల్ చిల్డ్రన్స్ మ్యూజియంలోనూ ఉన్నాయి.

కొసమెరుపు

ఇదంతా చదువుతుంటేనే... ఎప్పుడెప్పుడు అక్కడికెళ్లి చూద్దామా అనిపిస్తోందికదా. కానీ అప్పట్లో ప్రభుత్వ అధికారులు ఈ గార్డెన్‌ను పూర్తిగా తీసిపారేద్దామనుకున్నారంటే నమ్ముతారా! నమ్మరుగాక నమ్మరు. అసలు అధికారులు అలా ఎందుకు అనుకున్నారంటే... ఈ అద్భుత కళాఖండాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వ స్థలంలో. అదీ ఎవ్వరికీ తెలీకుండా రహస్యంగా చేశాడు. ఏదైనా ఎక్కువరోజులు దాగదుకదా. ఓ శుభముహూర్తాన అధికారుల చూడనే చూశారు. పై అధికారులకు తెలియచేశారు. అయితే వారిలో కొందరు కళాహృదయంతో చంద్‌ని ప్రోత్సహించారు. ఆపై అధికారులు మాత్రం ఈ పార్క్‌ను తొలగించాల్సిందేనని బుల్డోజర్లను పంపారు. విషయం తెల్సిన జనాలు మానవహారాలు కట్టి తమ నిరసనను తెలియచేశారు. ఇలా ఎన్నో నిరసనల అనంతరం ప్రభుత్వం పార్క్‌ని యథాతథంగా వుంచడానికి నిర్ణయించుకుంది. లేకపోతే... మనకు ఇంత మంచి గార్డెన్‌ను చూసే అదృష్టమే వుండేదికాదు. ★



సందర్శనీయ వేళలు

రాక్ గార్డెన్‌ను ప్రతిరోజూ తెరిచే ఉంచుతారు. ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు.

అక్టోబర్ 1 నుంచి మార్చి 31 వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంచుతారు. ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5లు, పిల్లలకు రూ.3లు.



సీరియల్

గని



<u>జరిగినకథ :</u>

గనిలో పనిచేసే కార్మికుల జీవితాల్లో ఆస్వాదించడానికి ఏముంది? భూమిలోపల గుహల్లోనే వీళ్ల జీవితాల్లో అధికభాగం గడిచిపోతోంది. రుచిలేని ఎండు రొట్టె ముక్కలు. కారం పూసినట్టు సహజ వర్ణం కోల్పోయిన దేహాలు. పందిపిల్లల్లా వీళ్ల చుట్టూ తారాడే పిల్లాజెల్లా. ఆశలూ, ఆకాంక్షలూ లేకుండా బతికేయడానికి కట్టడి చేయబడిన జన్మాలు. తమ దుఃఖానికి పరిష్కారం కనిపించని తరుణంలో, ఏ గత్యంతరమూ కానరాని పరిస్థితుల్లో తమకొక ఊరటగా, బావటగా దైవాన్ని ఆశ్రయిస్తారు బీదవాళ్లు. దైనందిన జీవితంలో ఎంత దుఃఖం వున్నా కొమ్మల్ని పట్టుకుని వేలాడే కోతుల్లా, ఆశను పట్టుకొని వేలాడుతూనే వుంటారు. మృత్యువు మాత్రమే తమను దుఃఖం నుంచి విముక్తం చేసక్తెందని భావించి జీవిత కాలమంతా అణిగిమణిగి వుంటారు. కార్మికుల మనసుల్లో అజ్ఞానంలోంచి పుట్టిన భయాలను పోగొట్టాలని భావించాడు బికాస్. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ఇరవై ఏడవ భాగం)

వంచిన తలను అతడు నెమ్మదిగా పైకెత్తాడు. మనసులోపలి గందరగోళం మటుమాయమైట్టు తేటగా ఉందతడి మొగం.

"నువ్వనుకుంటున్నట్టు విప్లవం రాదు. ప్రజాస్వామ్యం వచ్చేసింది. ప్రతిఒక్కరికీ ఓటుహక్కుంది. ఏ నిర్ణయమైనా ప్రజలే తీసుకుంటారు. ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిందే. ఉద్యమం, సమ్మె వంటి వాటికి కాలం చెల్లింది".

ఎండిపోయిన కళ్లతో, పాలిపోయిన మొహంతో కార్మికోద్యమం పట్ల తీవ్రమైన అపనమ్మకంతో అతడు చెప్తున్న మాటలు బికాస్‌ను సూటిగా తాకాయి.

"విప్లవం అంటే బాంబులు పేల్చడమేనని నువ్వనుకుంటే అది పొరపాటు. కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగించే చట్టాలను మార్చడం, ప్రజా శ్రేయస్సుకు విఘాతం కలిగించే చర్యల్ని తిప్పికొట్టడం కూడా విప్లవమే. దీనికోసం ఏదో ఒక రూపంలో ఉద్యమాలు నడపాల్సిందే. ఉద్యమాలు లేకుండా మార్పు వచ్చిన దాఖలా చరిత్రలో కనిపించదు...

చేదు నిజాన్ని జీర్ణించుకోలేక, దాన్ని తిరస్కరిస్తున్నట్టు గాల్లో చేతులు విసిరేస్తూ "సమ్మెల ద్వారా, ఉద్యమాల ద్వారా మాత్రమే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నావు... నీ మార్గంలో వెళితే మొదటికే మోసం వస్తుంది. ఉన్న ఉద్యోగం కాస్తా ఊడిపోతుంది" అన్నాడు మనోజ్ కుమార్.

యజమాన్య కనుసన్నలలో మసలుకొనే మనోజ్ మనోభవాలు మరెలా ఎలా ఉంటాయి? అనుకొన్నాడు బికాస్. "ఇప్పటి దాకా మనకు లభిస్తోన్న సదుపాయాలేమిటి? చవగ్గా సారా చుక్కలు, సుఖరోగాలు చేకూర్చే వ్యభిచార గృహాలు. లేదా వివాహబంధం మూలంగా పిల్లల్ని కనేయడం, వాళ్లను పోషించడం కోసం ప్రాణాలు పణంగా పెట్టి శ్రమించాల్సి రావడం. జీవితానికి ఒక విలువ, గౌరవమూ ఉందని మనం గ్రహించలేదు. పెంపుడు కుక్కకు నాలుగు మెతుకులు విదిల్చినట్టు గాడిద చాకిరీ చేయించుకుంటుంటే దయామృతం కురిపిస్తున్నారని మురిసిపోతున్నాం. వాళ్ల సుఖాలకు మన శ్రమే మూలమన్న స్పృహ లేకుండా పోయింది" అన్నాడు.

కార్మిక వర్గ ప్రయోజనాలకు ద్రోహం కలుగజేస్తోన్న తన అభిప్రాయాలను సమర్థించుకోవడానికి కాస్త తడబడ్డాడు మనోజ్. మొగం మీది చెమటను తుడుచుకొంటూ "కోటానుకోట్ల ప్రజలకు కూడపెట్టడం అంత తేలికైన పనా? మనం మొండివైఖరి అవలంబిస్తే ఎలా? మన పట్టును కాస్త సడలిస్తేనే దేశం బాగుపగుతుంది. మన భావితరాల వాళ్ల జీవితాల్లో వెలుగు నిండుతుంది... ఈ గనులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండేటప్పుడు మన పరిస్థితి ఎలా ఉండేదో గుర్తు చేసుకోండి" అన్నాడు.

సలసల కాగుతోన్న నూనెలా బికాస్ హృదయం కుతకుతలాడింది. కఠిన పదాలు వెలువడుతాయేమోనని భయపడ్డాడు. "పన్నెండు గంటల పాటు చేయాల్సిన పనిని ఎనిమిది గంటల్లో చేయిస్తున్నారు. ఇక ఒంట్లో శక్తి మిగిలి ఉంటుందా...? లాభాలు తగ్గకూడదు. దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూనే ఉండాలి. మనం అంత: పాతాళంలోకి తోయబడ్డాం" అన్నాడు, గుండెల్ని చీల్చుకొస్తోన్న మాటల్ని నియంత్రిస్తూ. అయితే సంయమనం ఎంతోసేపు నిలవలేదు. చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెబితే గానీ మనసు శాంతించదని గ్రహించాడు.

"మనం పిరికిపందలం కాము. మన బలం అంతా ఇంతా కాదు. ఆంగ్లేయులతో పోరాడినప్పుడు, ఇతరదేశాల నుంచి ఆయుధాలను ఓడల్లో తెచ్చాం మనం. దేశం లోపల వాళ్ల ఆయుధాగారాల్లో ప్రవేశించి, ఆయుధాలను కైవసం చేసుకున్నాం... స్వాతంత్ర్యం కోసం ఉరికంబం ఎక్కిన వాళ్లం. భూమి కోసం భూస్వాములతో... పోరాడి చెరసాలకు వెళ్ళిన వాళ్లం. అంటువంటి వారసత్వం మనది. మన బలం ఓటమి ఎరుగదు. ఐక్యత లేనప్పుడూ, పిరికితనం ఆవరించినప్పుడూ మాత్రమే ఓటమి సంభవిస్తుంది. కార్మికులు ఒక్కతాటిమీద నడిస్తే అపజయం దరిచేరదు. పతనం కలుగదు. కార్మికశక్తికి చావులేని వరం ఉంది. అందుకే సమాజం అభివృద్ధి చెందుతోంది. మానవ జీవితం ఇతోధికంగా మెరుగవుతోంది" అంటూ తన మనసులోని వేడిని చల్లార్చుకుంటున్నట్టుగా తనకే ఆశ్చర్యం గొలిపేంత వేగంగా తన భావాలను వెల్లడించాడు.

కార్మికుల హక్కుల కోసం సాగుతోన్న ఉద్యమానికి తాము వ్యతిరేకుల మన్న సత్యం బహిర్గతమై పోతుందేమోన్న ఆందోళనతో "మనం సమ్మె గురించి మొండివైఖరి అవలంబించకూడదు. ఆకలి అన్ని అనుభూతులనూ

హరాయించగల బలీయమైన శక్తి సమ్మె కాలంలో గనుల్లోని బొగ్గు పదిలంగానే ఉంటుంది. మన ఐకమత్యమే దెబ్బతింటుంది. అలా జరిగితే ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న వాళ్ళను యాజమాన్యం బలిగొంటుంది" అన్నాడు మనోజ్.

మనోజ్ పట్ల స్నేహభావం లేకపోయినప్పటికీ, ఒకచోట కూచుని పరస్పరం చర్చించుకుంటోన్న అవకాశాన్ని జారవిడుచుకోదలచుకోని వాడల్లే తాను చెప్పవలసిన విషయాల్ని చేప్పాశాడు బికాస్ "సమ్మె మనకు హక్కుల్ని సాధించి పెడుతుంది. కార్మికుల మధ్య ఐకమత్యాన్ని నెలకొల్పుతుంది. పిరికితనాన్ని పారదోలుతుంది. మొక్కవోని ధైర్య సాహసాలను కలిగిస్తుంది. మొత్తమ్మీద, మానవ ప్రయత్నానికి ఎనలేని గౌరవం సంపాదించి పెడుతుంది".

కార్మికులు వచ్చి చేరారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె తాలూకు ఏర్పాట్ల గురించి చర్చించనున్నందువల్ల, మామూలుగా సమావేశాలకు రాని వాళ్ళుకూడా వచ్చారు. ద్రోహబుద్ధితో మనోజ్ వెలిబుచ్చిన అభిప్రాయాల వల్ల బికాస్ మనసులో విసుగు రాజుకుంటూనే ఉంది. దాన్ని చల్లార్చుకునే ప్రయత్నంలో తనలో ఇలా అనుకున్నాడు:

'అనేక సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సి ఉంది. కార్మికులకు ముప్పూటలా తిండి లభించాలి. ఆడంబరాలు అక్కర్లేదు గానీ కనీసావసరాలు తీరాలి. తమ చుట్టూ ఉన్న సృష్టిలోని సౌందర్యాన్ని ఆస్వాదించగలగాలి. పిల్లల్ని, మనుమళ్లను, సహప్రాణుల్ని అందర్నీ నులకమంచంలోనైనా కూచొని చూస్తూ మురిసిపోవాలి... మరేమీ వద్దు. ఇంతకాలం మూగజీవులుగా ఉండిపోయాం. అలాగని పేగుల్ని పెకలించి బయట పారేయగలమా? నామమాత్రపు కూలికి పనిచేశాం. ఇంకా చవగ్గా పనిచేయటానికి పోటీపడేవాళ్ళు కూలీల చెమటచుక్కలు ఏ మాత్రం విలువ చెయ్యవా?'

రానున్న సమ్మె గురించి ఆలోచిస్తున్నారు కార్మికులు. అది కచ్చితంగా తమకు పెను సవాలు. అదెలా ఉంటుందో వాళ్ళు ఎవరికి తోచినట్టు వారు ఊహించుకుంటున్నారు.

కార్మికులు నివసించే కాలనీ వెలవెలబోతోంది. కుక్కలు కూడా గట్టిగా మొరగడం లేదు. ఏదో కలలో మొరుగుతున్నట్టుగా సన్నగా మూలుగుతున్నాయి. పశువుల కొట్టం ఖాళీగా ఉంది. గంపల్లో చిరుతిళ్ళు తీసుకొచ్చి అమ్మే స్త్రీల అరుపుల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. గంపల స్త్రీలను చూడగానే గంతులేసే పిల్లల జాడ కనిపించడం లేదు. మామూలుగా వచ్చే గంపల స్త్రీలెవరైనా వచ్చి అప్పుగా రెండో, మూడో ఇడ్లీలిచ్చి ఆకలి పోగొట్టరా అని ఎదురుచూస్తున్నారు కార్మికులు. ఇళ్లన్నీ భయంతోనూ, అప నమ్మకంతోనూ మునగదీసుకొన్నట్టు నిశ్శబ్దంగా చీకటి గుయ్యారాల్లా ఉన్నాయి. ఆకులు రాలకుండా ప్రకృతంతా నిశ్చేతనంగా ఉంది. గుడి మండపంలోనూ చెట్ల నీడల్లోనూ చతుర్ముఖ పారాయణం చేస్తూనో, లోకాభిరామాయణం మాట్లాడుకుంటూనో పొద్దుపుచ్చే కాలక్షేపం రాయుళ్ళెవరూ కనిపించకుండా ఆ స్థలాలన్నీ బోసిగా కనిపిస్తున్నాయి. గాల్లో ఎగురుతున్న ఎండుటాకుల్లా సన్నగా, తిండికి మొగం వాచిన వాళ్లలా కనిపిస్తోన్న స్త్రీపురుషులు ఆకలికి నకనకలాడుతున్న దృశ్యాలు ఒకటొకటే మరుగున పడుతుంటే, కార్మికులు క్రమంగా బికాస్ కేసి చూడసాగారు.

కార్మికుల మనోభావాల్ని గుర్తించిన బికాస్ వాళ్ళకేసి తీక్షణంగా చూశాడు. నలువైపులా కలయజూశాడు. ముక్కు ఎగబీల్చాడు. కనురెప్పలు టకటకా కొట్టుకొన్నాయి. మంచు తెరల్ని చీల్చుకొని వచ్చే సూర్య కిరణాల్లా కళ్ళలోంచి వెలువడుతోన్న తీక్షణాదృక్కులు. ఏదో నములుతున్నట్లు అతడి దవడలు పైకీ కిందికీ కదిలాయి. అతడు అచంచల విశ్వాసంతో, దృఢ స్వరంతో ఇలా అన్నాడు.

"సమ్మె అన్నది కాలక్షేపం కాదు, వినోదం అంతకన్నా కాదు ఆకలి పోరాటం. అధిక లాభాల కోసం, మరిన్ని సుఖాల కోసం వెంపర్లాడే అధికార యంత్రాంగం దయాదాక్షిణ్యాలు ప్రదర్శించదు. అది శ్వాస వదిలేటప్పుడు సైతం డబ్బు వాసనే వెలువడుతుంది. ఛాతీపై గుండె కొట్టుకునే చప్పుడు వినిపించదు, డబ్బు లెక్కపెట్టుకొనే చప్పుడే వినిపిస్తుంది. ఆకలికీ, ఆడంబరానికీ జరిగే పోరాటంలో శ్రామికులు తాత్కాలికంగా ఓటమి పాలుకావచ్చు. అయితే ఆకలి కాస్తా పస్తుగా పరిణగమిస్తే, శ్రామికుల్ని హరించివేస్తుంది. ఆకలి ఒక్కోసారి అణిగిమణిగి ఉండేలా చేస్తుంది.కానీ పస్తుండడం అంటే మృత్యువు మెల్లగా ఒడిలోకి చేరటమే. పస్తున్న వాడికి జీవితం గురించి, సామాజిక దృక్పథం గురించి అవగాహన కలిగిస్తే పస్తుండి చావడం కన్నా పోరాడి చావడం మేలని గ్రహిస్తాడు. జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే త్యాగాలకు సంసిద్ధం కావాల్సిందే. విముక్తికీ ప్రగతికీ, ఆనందానికి కేంద్రబిందువు త్యాగమే.

కార్మికులకు దేనిగురించి అవగాహన కలిగించాలని భావించాడో దాన్ని పూర్తిగా విశదపరచాడు బికాస్. చైతన్యం లేకుండా గుడిసెల్లో బాధాకరమైన జీవితం గడుపుతున్న ప్రజలు వీళ్ళు. చెత్తకుప్పలా ఎంత దు:ఖం పేరుకున్నా పశువుల కొట్టంలో నిశ్చలంగా పడుకున్న ఎనుముల్లా జీవితాలను వెళ్ళబుచ్చే బడుగు గుండెల్లో కొత్త చైతన్యం జలలూరుతున్న అనుభూతి.

అతడి మొహంలో అలసట కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చూపులు రెప్పల మాటున దాక్కొన్నాయి. అక్కడ చిరిగిపోయిన నిడుపుచేతుల చొక్కాను పైకి మడిచి "మన ఐకమత్యాన్ని దెబ్బతీయడానికి ఎవరైనా కుతంత్రం పన్నవచ్చు. దానికి మనం ఆస్కారం ఇవ్వకూడదు. మన ఇతర బలహీనత లన్నిటీని ఐక్యమత్యంతోనే అధిగమించవచ్చు" అంటూ ముగించాడు. ఉద్యమాన్ని పరోక్షంగా వ్యతిరేకిస్తున్న వాళ్ళకు హితవు పలుకుతున్నట్టూ, కార్మికులందరికీ వాస్తవాన్ని విడమరిచి చెబుతున్నట్టూ ఉన్నాయతడి మాటలు.

రేపు చేపట్టవలసిన కార్యక్రమం గురించి ఆలోచిస్తూ తమ తమ గూళ్ళకు చేరారు కార్మికులు.

✡ ✡ ✡

గుడిసెల్లో రాత్రి తాలూకు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. చాలా గుడిసెల్లోంచి సన్నని మూలుగూ, గుండె అదిరిపోయేలా ఎడతెగకుండా ఖళ్ళుఖళ్ళున దగ్గూ వినిపిస్తున్నాయి. గనిలో పనిచేయడం వల్ల సంక్రమించిన ఆస్థమా, క్షయ వగైరా రోగాల శాబ్దిక రూపాలవి. ఏదో ఒక విధంగా ఊపిరితిత్తులకు గానీ, కిడ్నకి గానీ హాని వాటిల్లని కార్మికుడు ఒక్కడు కూడా లేడు. వాళ్ళు దగ్గి ఉమ్ముతున్నపుడు నల్లగా గడ్డకట్టిన ద్రవమే వెలువడుతుంది. ఒక్కోసారి నల్లటి ఉమ్మిమీద కుంకుమ చల్లినట్టు నెత్తుటి చుక్కలు తేలుతుంటాయి. అలాంటి వ్యక్తుల్ని మరణదేవత అనుగ్రహించిందని గ్రహించవచ్చు. అయితే వాళ్ళు ఈ విషయాన్ని పైకి చెప్పుకోరు. మైనింగ్ మేస్త్రీకి తెలిస్తే పనికాస్తా పోతుందని భయం. కార్మికులు ఒకరికొకరు పరస్పరం సహకరించుకుంటూ నెట్టు కొస్తున్నారు. సెగ చీకటి, విషపుగాలి, గాలి ఒత్తిడి... వీటి పర్యవసానంగా కుంటి కుక్కల్లా ఎలాగో బతుకీడుస్తున్నారు.

అధికశ్రమ వల్లా, బలహీనత వల్లా వాళ్ళ చేతి వేళ్ళ చివర్లు వాచి ఉన్నాయి. నిరంతరం బొగ్గును తవ్విపోయడం వల్ల గోళ్ళు అరిగిపోయాయి. కాలిగోళ్ళకు మధ్య బురదపుళ్ళ లాంటి పుళ్ళు. అడుగుతీసి అడుగలేయడం నరకయాతనగా ఉంది. విశ్రాంతి లేకుండా తన మానాన తాను పనిచేసుకుపోతుంటే ఆ బాధ అంతగా తెలియదు. రాత్రి పూట వేళ్ళనూ, గోళ్ళనూ ఏదో పురుగు తొలుస్తున్నట్టు సహింపరాని బాధ. అతడు నిద్రపట్టక అల్లాడిపోతున్నాడు.

తట్టుకోలేనంత వేడిమికి, దోమలు విపరీతంగా కుడుతున్నాయి. విసనకర్రతో దోమల్ని తోలుతూ సగం నిద్ర. తీవ్రమైన అలసట వల్ల కళ్ళు సోలుతున్నాయి. నిద్ర పాడవడం వల్ల రెప్పలు కుంచించుకుపోయాయి. చంద్రుడి చుట్టూ కోట కట్టినట్టు రెప్పల చుట్టూ నల్లటి గుంతలు. నిద్రపోయినా, పోకపోయినా పొద్దున ఆరుగంటలకు గనిలోకి వెళ్ళడానికి అనువుగా కాలకృత్యాలు తీర్చుకుని తయారై పోవాలి. మృత్యువు వెంబడించినా, గనిలోకి చేరుకొని చావాల్సిందే మైనింగు గుమాస్తా కార్మికుల పాలిట యమకింకరుడు. ఒక్కోసారి దైవతుల్యుడు కూడా.

తొలిసంజెవేళ. క్రూరమృగమేదో తరుముకొస్తుంటే పారిపోతున్న వాళ్ళలా కార్మికులు గనికేసి పరుగుదీస్తున్నారు. వరికంకుల వాసనా, బురదవాసనా కలగలిసిన వింతవాసన. పొలం గట్ల మీద పెరిగిన ఈతచెట్లలో గూడు కట్టుకొన్న గువ్వలు ప్రభాతాన్ని స్వాగతిస్తున్నట్టు కువకువలాడుతున్నాయి.

(ఇంకావుంది)

ఆ ఒకరు ఎవరు?

పిల్లలూ...కింద మూడు లైన్లలో ఉన్న ముగ్గురిలో ఒక్కొక్కరిది నాలుగేసి ఫొటోలు వున్నాయి. కానీ వాటిలో ఒకటి మాత్రం తేడాగా వుంది. అది ఏదో చెప్పండి.





దారి కనిపెడదాం

ఫ్రెండ్స్! పైనున్న ముగ్గురిలో ఎవరు అమ్మమ్మ దగ్గరికి రాగలరో చెప్పండి.

ఆ ఐదు ఏవి!

ఫ్రెండ్స్...కింద ఐదు వరుసల్లో కొన్ని బొమ్మలు కనిపిస్తున్నాయి చూశారుగా. వాటిలో ఇంగ్లీషు అక్షరాలలో వుండే వోవెల్స్ అంటే A,E,I,O,U తో మొదలయ్యే వస్తువులు వున్నాయి. అవేంటో చెప్పేస్తారుగా.



అవేంటో...

పైనున్న అన్ని వస్తువులు ఆస్పత్రికి సంబంధించినవి. కానీ రెండు వస్తువులు మాత్రం వేరేవి వుంటాయి. అవేంటో కనిపెట్టి వాటి నెంబర్లు రాయండే.

వెతుకుదామా...

పిల్లలూ! కిందున్న పొదలో పది రకాల పండ్లు వున్నాయి. అవి ఎక్కడున్నాయో వెతికేద్దామా.

జంట ఏదో...

చిన్నారులూ...కిందున్న ఆరు బొమ్మల్లో రెండు అచ్చంగా ఒకేలా వున్నాయి. వాటి నెంబర్లు రాసేయండి మరి.





పదాలు రాసేద్దాం

పిడుగులూ... పైన ఆటలకు సంబంధించిన ఎనిమిది పదాలు ఉన్నాయి. కానీ అవి తికమకగా రాసి వున్నాయి. మరి మీరు వాటిని కరెక్ట్‌గా రాస్తారు కదూ.

Red	Blue	Pink	Black
Purple	Yellow	Brown	Grey

P	I	N	K	O	B	S
B	L	A	C	K	R	T
G	R	E	Y	V	O	B
Y	E	L	L	O	W	L
W	D	O	C	K	N	U
I	P	U	R	P	L	E

కనిపెట్టండి

పిల్లలూ... పైన కొన్ని రంగుల పేర్లు వున్నాయి. వాటికిందే వున్న అక్షరాల్లో అవి ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండే.

జవాబులు

పదాలు రాసేద్దాం: 1.kickoff, 2.throw in, 3.dribbling, 4.penalty, 5.off side, 6.half time, 7.foul, 8.goal.

జంట ఏదో...: 3,5

ear, orange, umbrella, apple, owl.



'పోయినోళ్లు అందరూ మంచోళ్లు, ఉన్నోళ్లు పోయినోళ్ల తీపి గురుతులు' అని భావుకతతో రాసిన ఆత్రేయ పాట ఘంటసాల గాత్రంతో మనను ఎప్పుడూ అలరిస్తూ వుంటుంది. అయితే పోయినోళ్లలోనూ నిజంగా మంచి వాళ్లు సమాజానికి మంచి చేసి, మార్పులు తెచ్చిన వాళ్లను చిరకాలం గుర్తుంచుకోవడం ద్వారా మనం కృతజ్ఞత ప్రకటించుకోవడమే కాక వారి విశిష్టతకు, విజయాలకూ మూలం ఏమిటో పునశ్చరణ చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తుంటాం. వారి ఆశయాలూ ఆదర్శాలను పునరుద్ఘాటించే ప్రయత్నం చేస్తుంటాం. జయంతులు, వర్ధంతులు అందుకు చాలా సముచితమైన సందర్భాలు.

వందేళ్ల వందనాలు!

- తెలకపల్లి రవి

ఈ ఏడాది రాష్ట్రంలోనూ అనేక మంది ప్రముఖులు, ప్రసిద్ధుల శతజయంతి సందర్భాలు వస్తున్నాయి. 2008లో మొదలై 2009లో ముగిసేవి కొన్ని కాగా 2009లో మొదలై 2010లో ముగిసేవి మరికొన్ని. ఈ జాబితాలో చాలామంది రాజకీయ, కళా, సాహిత్య రంగాలలో అనన్య సామాన్యమైన ప్రభావం ప్రసరించిన వారే కావడం విశేషం. ఈ దశాబ్దిలో శతజయంతి జరుగుతున్నదంటే వారు ముప్పై నలభై దశకాలలో బాగా కృషి చేసిన వారై వుండాలి.అది మన దేశ రాజకీయ సామాజిక పరిణామాలలో కీలకమైన కాలం. 1920 నుంచి 30 వరకూ మొదటి సాంస్కృతిక వెల్లువ వచ్చింది. 1909లో గురజాడ దేశభక్తి గీతం ఒక కొత్త మలుపు అనుకుంటే దాని కొనసాగింపుగా 1920-30 మధ్య త్రిపురనేని, చలం, శ్రీపాద, విశ్వనాధ, ఉన్నవ లక్ష్మీనారాయణ, కృష్ణశాస్త్రి వంటి వారి ప్రేరణతో అటు సాహిత్య స్పృహ, ఇటు జాతీయ చైతన్యం, హేతువాదం వగైరాలు పలు విధాల జవసత్వాలు సంతరించుకున్నాయి. ఈ క్రమంలో పునరుద్ధరణ వాదానికి పునర్వికాసానికి మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. సహజంగానే ఈ క్రమంలో నూతన భావాలు నిలదొక్కుకున్నాయి. ఆ పునాదులపై 30వ దశకంలో అన్ని రంగాలలోనూ అనేక మంది ప్రతిభావంతులు ప్రభవించారు. ప్రకాశవంతమైన ప్రభావాన్ని ప్రసరించారు. స్వాతంత్ర్యోద్యమంలోనూ అది కీలకమైన కాలం. ఆర్థికంగానూ ప్రపంచ సంక్షోభం వచ్చింది. ఇన్ని కారణాలు నాటితరాన్ని ఆలోచింపచేశాయి. వారందరికి సంబంధించిని అన్ని విశేషాలనూ ఒకే వ్యాసంలో చెప్పుకోలేకపోయినా స్థూలంగా కొందరికైనా వందేళ్ల వందనాలు చెప్పుకోవడం మన బాధ్యత.

శ్రీరంగం శ్రీనివాసరావు

తెలుగు వారికి సంబంధించినంత వరకూ ఈ జాబితాలో అగ్రగణ్యుడు శ్రీశ్రీగా ప్రసిద్ధుడైన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. ప్రజా కవిత్వ వైతాళికుడు, ప్రగతిశీల భావాల ప్రేరేపకుడు. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని భూమార్గం పట్టించి భూకంపం పుట్టించిన పుడమి పుత్రుడు. 1910 ఏప్రిల్ 30న విశాఖపట్టణంలో పుట్టిన శ్రీశ్రీ తల్లి చిన్నప్పుడే కన్నుమూసింది. తండ్రి సూర్యనారాయణ గణిత పండితుడు. ఆయన ప్రోత్సాహంతో బాల్యంలోనే సాహిత్యం పట్ల ఆకర్షితుడైన శ్రీశ్రీ మొదట్లో విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రిల ప్రభావంతో పద్యకావ్యాలు రాశాడు. అయితే కొద్ది కాలంలోనే జీవితానుభవమూ, సమాజ పరిస్థితులూ ఆయనను అభ్యుదయ భావాల వైపు మరల్చాయి. ఆకలి దశకంగా పేరొందిన 30లు ఆయనలో అక్షరాగ్ని రగిలించాయి. అంతకు ముందే గురజాడ అప్పారావు మొదలెట్టిన ప్రజా భాషను, దేశ భక్తి

మగ్దూం మొహియుద్దీన్

భావాలను స్వీకరించిన శ్రీశ్రీ 1933లో నేను సైతం అంటూ జయభేరి పేరుతో కవిత రాయడం ద్వారా తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం ప్రారంభించాడు. 'పదండి ముందుకు' అంటూ అక్షరాలను కష్టజీవుల విముక్తి పథంలోకి మళ్లించాడు. తెలుగు భాషకు భావానికి కొత్త వూపునూ, రూపునూ, చూపునూ కలిగించాడు. మార్క్సిజం పరిచయం, శ్రమజీవుల ఉద్యమాలతో మమేకత, దేశ దేశాల ప్రగతిశీల ప్రయోగాత్మక కవుల రీతుల పరిచయం ఆయనకు గొప్ప ధాటినిచ్చాయి. ఆవిధంగా అటు సంప్రదాయ రీతులనూ ఇటు సామ్యవాద భావాలనూ వంటపట్టించుకున్న శ్రీశ్రీ 'పులి చంపిన లేడి నెత్తురూ, ఎగరేసిన ఎర్రని జండా కావాలోయ్ నవకవనానికి' అంటూ అక్షరాన్ని అరుణారుణం చేశాడు. ఆఖరి వరకూ అదే ఆశయానికి అంకితమై ఉత్తేజానికి పర్యాయపదంగా వెలుగొందాడు. సినిమా పాటల్లోనూ, పత్రికా రచనల్లోనూ సమీక్షల్లోనూ వ్యాసాలు వ్యాఖ్యల్లోనూ అనువాదాలు కథలూ అన్నిట్లోనూ తనదైన ప్రత్యేకతతో తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలను సుసంపన్నం చేశాడు. తొలినాటి సాహిత్య సంఘాలతో మొదలెట్టి తర్వాత కాలంలో అభ్యుదయ విప్లవ రచయితల సంఘాలలోనూ కీలక పాత్ర వహించారు. బహుశా ఆధునిక తెలుగు సాహిత్యకారులలో మరెవరికి లేనంత విస్తృతమైన ఆదరణ పొందిన శ్రీశ్రీ 1983 జూన్ 14న కన్నుమూశాడు. ఆయన శతజయంతి వుత్సవాలు రాష్ట్రంలోని వూరూరా అత్యంత విస్తృతంగా జరుగుతున్నాయి.

కొడవటిగంటి కుటుంబరావు

కవిత్వంలో శ్రీశ్రీ లాగే కథనవలా రచనలో అగ్రగణ్యుడు కొడవటిగంటి కుటుంబరావు. మరే ఇతర రచయితకన్నా ఎక్కువ సాహిత్యాన్ని, ఎక్కువ వాస్తవిక సాహిత్యాన్ని అందించిన కలం యోధుడు. శ్రీశ్రీ లాగే కమ్యూనిస్టు అభిమాని. విప్లవాభిలాషి. 1909 సెప్టెంబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో పుట్టిన కొడవటిగంటి రచయితలకు ఒక శిక్షణాలయం వంటి వారు. ఏకకాలంలో సామాజిక అవగాహన సాహిత్య సృజన తెలియడానికి ఆయన రచనలు కరదీపికలు. అరుణోదయం, చదువు, వారసత్వం, అనుభవం, కులం లేని మనిషి, వంటి నవలలు, అసంఖ్యాకంగా కథలూ రాశారు. గల్పికలకు విస్తృత ప్రాచుర్యం కల్పించి వాటి ద్వారా సమకాలీన పరిణామాలపై సజీవమైన వ్యాఖ్యానం అందించారు. ఇవేగాక సైన్స్, రాజకీయాలు, సినిమాలు, సాహిత్యం, సంస్కృతి వంటి అంశాలపై వందలాది వ్యాసాలు రాశారు. ఈయనను రష్యన్ మహా కథకుడు ఆంటన్ చెహోవ్‌తో పోల్చడం పరిపాటి. శ్రీశ్రీ కవిత్వం ఉద్వేగ ప్రధానమైతే కొ.కు సాహిత్యం ఆలోచనాత్మకం. జీవితంలో వచ్చే అనేకానేక మార్పులను అవి మనుషుల మనస్తత్వాలలో తెచ్చే మార్పులను అత్యద్భుతంగా అత్యంత ప్రగాఢంగా చిత్రించిన కొ.కు మార్క్సిస్టు భావజాలానికి కట్టుబడ్డారు. అభ్యుదయ విప్లవ రచయితల సంఘాలలో పనిచేశారు కాని ఎక్కువగా తన ఉద్యోగ జీవితంలోనే మునిగి తేలారు. చక్రపాణి సారథ్యంలో సాటిలేని పిల్లల పత్రిక చందమామను తీర్చిదిద్దిన ప్రతిభాశాలి. యువ పత్రికను సుసంపన్నం చేయడమే కాక మరికొన్ని పత్రికలలోనూ పనిచేశారు. తొలితరంలో సినిమాలకూ రచనలందించారు. గొప్ప విమర్శకుడు.

సుంకర సత్యనారాయణ

ప్రజా కళలు సాహిత్యం అన్న మాటకు పర్యాయ పదం అనదగిన వ్యక్తి సుంకర సత్యనారాయణ. వీర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని కళాత్మకంగా అజరామరం చేసిన మాభూమి నాటకాన్ని మిత్రుడు వాసిరెడ్డితో కలసి రచించిన సుంకర 1909 మార్చి 23న కృష్ణాజిల్లా ఈడ్పుగల్లులో పుట్టారు. తండ్రి ప్రోత్సాహంతో చిన్నప్పుడే పురాణాలూ బుర్రకథలూ నాటకాలపై ఆసక్తి పెంచుకున్నారు. వాటిని జాతీయోద్యమంతో మేళవించిన నేరానికి జైలుశిక్ష అనుభవించారు. సోదరుడు వీరభద్రరావుతో కలసి జమీందారీ వ్యతిరేక పోరాటంలో పాల్గొంటూ క్రమేణా కమ్యూనిస్టు అయ్యారు. ఫాసిజానికి వ్యతిరేకంగా సాగిన కళా ప్రభంజనంలో సుంకర కీలక పాత్రధారి అయ్యారు. తిరువూరులో ఈ సోదరులు వల్లం నరసింహారావుతో కలసి ప్రజానాట్యమండలిని అభివృద్ధి చేశారు. వీరేశలింగం, అల్లూరి సీతారామరాజు, కష్టజీవి వంటి బుర్రకథలు రాసి సంచలనం సృష్టించారు. ఇవి బ్రిటిష్ ప్రభుత్వ నిషేధానికి గురైనాయి. ప్రసిద్ధమైన మాభూమి కూడా 128 దళాల ప్రదర్శనలతో కొత్త చరిత్ర సృష్టించింది. ఇదీ నిషేధానికి గురైంది. ఇవేగాక సుంకర ఇంకా అనేక నాటకాలు నాటికలు బుర్రకథలూ రాశారు. అనేక జన రంజక గీతాలందించారు. ఇక సినిమా రంగంలో ప్రజా కళాకారులు రూపొందించిన పల్లెటూరు, పుట్టిల్లు, నమ్మిన బంటు వంటి చిత్రాలకు ఆయన మాటలూ పాటలూ రాశారు.

గోపీచంద్

తెలుగునాట హేతువాద జ్యోతిని వెలిగించిన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పుత్రుడైన గోపీచంద్ కేవలం పండిత పుత్రుడుగా మిగిలిపోలేదు. 1910 సెప్టెంబరు 8న కృష్ణాజిల్లా అంగలూరులో పుట్టిన గోపీచంద్ గుంటూరు ఏసి కాలేజీలో చదువుతున్నప్పుడే అక్కడి గ్రంథాలయంలో చదువుతూ సాహిత్యంపై ఆసక్తి

గోపీచంద్

సుంకర సత్యనారాయణ

పెంచుకున్నాడు. న్యాయవాద విద్య నభ్యసించినా దానిపై మక్కువ లేక సాహిత్య జీవనం ఎంచుకున్నాడు. 1939లో గూడవల్లి రామబ్రహ్మం తీసిన గొప్ప చిత్రం రైతు బిడ్డకు రచన అందించి మంచి పేరు తెచ్చుకున్నారు. అప్పుడే దేశం ఏమైపోయేట్టు, భార్యల్లోనే వుంది అన్న కథా సంకలనాలను వెలువరించారు. మరికొన్ని చిత్రాలకు రచన, సంభాషణలు అందించడమే కాక లక్ష్మమ్మకథ, ప్రియురాలు, పేరంటాళ్ళ చిత్రాలకు దర్శకత్వం వహించి ఔననిపించుకున్నారు. 1946లోనే అసమర్థుని జీవ యాత్ర రచించిన గోపీచంద్‌కు సినిమా వాతావరణం పెద్దగా రుచించక తిరిగివచ్చారు. పై నవలలోనే తండ్రి ప్రభావానికి, జీవిత వాస్తవాలకు మధ్య నలిగిపోయే సీతారామరావు పాత్ర ద్వారా ఆయన తనలోని సంఘర్షణను కూడా వెల్లడించుకున్నారు. తర్వాత కమ్యూనిజం వైపు ఆకర్షితుడై, చివరకు దానితో విభేదించిన రాయిస్టు భావాలతో మిగిలిపోయాడు. అభ్యుదయ సాహిత్యానికి చేరువగా వచ్చి దూరంగా వెళ్లాడు. ఆ పైన దానిపై అనేక విమర్శలు చేశాడు. విదేశీ సాహిత్యంతోనూ విస్తృతమైన పరిచయం పెంచుకున్నారు. ఆయన నవలలు చీకటి గదులు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా, మెరుపుల మరకలు, యమపాశం వంటివి సుప్రసిద్ధాలు. కథలూ అసంఖ్యాకంగా రాశారు. వ్యాసకర్తగా ప్రపంచ తత్వవేత్తల పరిచయం వంటి పుస్తకాలు అందించారు. గోపీచంద్ ఆకాశవాణిలోనూ సమాచార శాఖలోనూ ఉన్నత బాధ్యతలు నిర్వహించారు.

స్త్రీపాత్రలలో చాలా తిరుగుబాటు ధోరణిని చూపించారు. ఆయన పాత్రలన్నిటిలోనూ భావాల ఘర్షణ కనిపిస్తుంది. కొన్ని చోట్ల అది అభ్యుదయంగా అనిపించినా అస్పష్టత అధికంగా వుంటుంది. 1962లో ఆయన చనిపోయారు.

సుద్దాల హనుమంతు

వీర తెలంగాణా రైతాంగ పోరాట సాహిత్యానికి ప్రతీకగా నిల్చిన ప్రజాకవి సుద్దాల హనుమంతు 1908లో నల్గొండ జిల్లా రామన్నపేట తాలూకా పాలడుగులో పుట్టారు. పద్మశాలీ కుటుంబంలో పుట్టిన సుద్దాల చిన్నప్పటి నుంచి నాటకాలపై ఆసక్తి పెంచుకున్నారు. కీర్తనలు భజనలు జానపద కళలు నేర్చుకున్నారు. సంఘ సంస్కరణ కార్యకలాపాలు సాగిస్తూ తర్వాత జీవనోపాధి కోసం హైదరాబాదు వచ్చి అటెండర్ ఉద్యోగంలో చేరారు. కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభల ఆధ్వర్యంలో తెలంగాణాలో కొత్త చైతన్యం రావడం చూసి ఉత్తేజితుడైనాడు. దళిత యువతిని పెళ్లిచేసుకున్నాడు. 1944లో ఆంధ్ర మహాసభ వలంటీర్‌గా పాల్గొన్నాడు. అప్పటి నుంచి ఉద్యమ మార్గం చేపట్టి గ్రామసంఘం ఏర్పాటు చేశాడు. ప్రజాశక్తి తెప్పించి తన గ్రామస్తులకు చదివి వినిపించేవాడు. సుంకర బుర్రకథలు చెబుతూ తను కూడా పాటలు రాయడం నేర్చుకున్నాడు. 'పల్లెటూరి పిలగాడా పశులు గాసే మొనగాడా' అన్న ఆయన పాట చాలా ప్రసిద్ధం. ఒకసారి సభ జరుగుతుంటే రజాకార్లు దాడి చేశారు. వారి నెదుర్కొంటూ అప్పటికప్పుడే 'వెయ్ వెయ్ వెయ్యర దెబ్బ' అన్న పోరు పాట పాడాడు. చివరి వరకూ కమ్యూనిస్టు ఉద్యమంతో వుండి 1982 అక్టోబరు 10న కన్నుమూశాడు. ఆయన కుమారుడే ప్రముఖ సినీ కవి సుద్దాల అశోక్ తేజ అన్నది తెలిసిందే.

మగ్దూం మొహియుద్దీన్

2009 ఫిబ్రవరి 4తో శతజయంతి ముగిసిన మగ్దూం మొహియుద్దీన్ కవిగా, కార్మిక నేతగా, కమ్యూనిస్టు యోధుడుగా సుపరిచితులు. ఉర్దూ సాహిత్యంలో ఆయనను శ్రీశ్రీతో పోలుస్తుంటారు. 1908 ఫిబ్రవరి 4న మెదక్ జిల్లా ఆందోల్ గ్రామంలో పుట్టిన మగ్దూం చిన్నవయసులోనే సామ్యవాద భావాల వైపు ఆకర్షించబడ్డారు. కొంతకాలం ప్రభుత్వోద్యోగం చేసినా 1934 నుంచి కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైనాడు. 1939లో మరికొందరు పెద్దలతో కలసి హైదరాబాదులో కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించారు. నిజాం కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూనే రాచరికాన్ని గౌరవించేందుకు నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. తర్వాత ఉద్యోగాన్నే వదిలేశాడు. నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నందుకు గాను ఆయనను జైలు పాలుచేశారు. జైలులో వున్నా ఆయన కలం కవితా సృజన కొనసాగిస్తూనే వచ్చింది. విడుదలయ్యాక మరింతగా పార్టీ కార్యకలాపాలలో మునిగిపోయిన మగ్దూం కార్మిక రంగంలో పనిచేశాడు. నిజాం రైల్వేలో సమ్మె చేసినందుకు మరోసారి జైలు శిక్ష. వీర తెలంగాణా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలో ఆయనొకరు. ఆ విధంగా అటు కవిత్వం ఇటు కార్యాచరణ రెండింటి సమ్మేళనం మగ్దూం. హవేలీ అన్న కవితలో నిజాంను అది ఒక దయ్యాల మేడ, శిథిల సమాజాల నీడ అని నిప్పులు చెరిగాడు. ఆయన ఉర్దూ కవితలు జనాన్ని ఎంతగానో ఉత్తేజ పర్చాయి. గురుదత్ కళాత్మక చిత్రం కాగజ్ కే ఫూల్ కోసం ఆయన రాసిన పాట జాతీయ పురస్కారం పొందినా ఆ వైపు మొగ్గలేదు. 1958లో ఎమ్మెల్సీగా ఎన్నికైనాడు. కార్మికోద్యమంలో సహచరుడైన రాష్ట్రపతి వివిగిరి కోరికపై ఢిల్లీలో ముషాయిరాలో పాల్గొనేందుకు వెళ్లిన మగ్దూం అక్కడే 1969 ఆగష్టు 26న కన్నుమూశాడు.

కాసు బ్రహ్మానందరెడ్డి

ఆంధ్ర ప్రదేశ్‌ను అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి. గుంటూరు జిల్లా



కొడవటిగంటి కుటుంబరావు

సుద్దాల హనుమంతు

చిరుమామిళ్లలో 1909జులై 28న జన్మించిన కాసు 12 వ ఏట గాంధీని చూసి ఉత్తేజితుడై స్వాతంత్ర పోరాట మార్గం పట్టాడు. న్యాయశాస్త్ర విద్యనభ్యసించినప్పటికీ వృత్తిని వదలిపెట్టి ఉద్యమాల్లో పాల్గొంటూ జైలు శిక్షలనుభవించాడు. ఆయన న్యాయవాద పరిజ్ఞానం, వ్యవహార దక్షత కారణంగా ప్రజా జీవితంలో ప్రముఖ స్థానం పొందగలిగారు. 1946లోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన కాసు కమ్యూనిస్టులు ఘన విజయం సాధించిన 1952-55 మినహాయించి 1972 వరకూ శాసనసభ్యుడుగా వున్నారు. 1956లో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. 1964 నుంచి 1971 వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్నారు. ఆయన హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వంటివి రూపు దిద్దుకున్నాయి. కోర్టు తీర్పుతో పదవి కోల్పోయిన మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పేరుతో ఉద్రేకాలు పెంచినా కాసు తలవంచకుండా సమైక్యతకే కట్టుబడ్డారు. కాని ప్రధాని ఇందిరాగాంధీ ఆయనతో రాజీనామా చేయించారు. తర్వాత కాలంలోనూ కేంద్రంలో అనేక మంత్రి పదవులు, కాంగ్రెస్ అధ్యక్ష పదవి, మహారాష్ట్ర గవర్నర్ బాధ్యతలు నిర్వహించిన కాసు 1994 మే 20 న కన్నుమూశారు.

దుర్గాబాయి దేశ్ ముఖ్

ప్రజా జీవితంలో ప్రముఖ స్థానం ఆక్రమించిన మహిళ దుర్గాభాయి దేశ్‌ముఖ్. 1909 జులై 15న రాజమండ్రిలో ఎనిమిదేళ్లకే వితంతువైన దుర్గాభాయి ఆ లోటును అధిగమించి శక్తివంతమైన మహిళా నేతగా ఎదిగారు. గాంధీజీ కాకినాడ పర్యటనలో తన బంగారు గాజులు ఇచ్చేయడమే గాక మిల్లు వస్త్రాలను దహనం చేసి ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలెట్టింది. గాంధీజీ హిందీ ప్రసంగాలను ఆమె తెలుగులోకి అనువదించేది.1930లో ఉప్పుసత్యాగ్రహానికి నాయకత్వం వహించిన దుర్గాభాయి మూడు సార్లు అరెస్టయింది. లార్డ్ కనింగ్ ఆమెను ఆడసింహం అన్నారు! కందుకూరి వంటి వారి సంఘ సంస్కరణ మార్గాన్ని ఆమె కడకంటా అనుసరించింది. తండ్రి చేసిన ఒకే ఒక తప్పు తన బాల్యవివాహమని చెబుతూనే ఆయన చనిపోయినపుడు తల్లికి జుట్టు కత్తిరించకుండా అడ్డుపడింది. న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యార్హతలు సాధించి రాజ్యాంగ రూపకల్పనలో భాగం పంచుకున్నది. మహిళలకు ఎంతో మేలు చేసిన హిందూ కోడ్ బిల్లు తయారీలో ఆమె పాత్ర చాలా వుంది. ఎన్నో ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తూ 1953లో కేంద్రమంత్రి చింతామణి దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకున్నది. ఈ దంపతులిద్దరూ పద్మభూషణ్ పొందడం అరుదైన విశేషం.మహిళల కోసం రచనలు చేయడమే గాక పత్రికలు నడిపింది. హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభ స్థాపించి స్త్రీ విద్యకు వైద్య సహాయానికి గొప్ప సేవలందించిన దుర్గాభాయి దేశ్‌ముఖ్ 1981మే 9న కన్నుమూసింది.

గౌతు లచ్చన్న

ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెసేతర ప్రతిపక్ష రాజకీయాలకు ఒక పెద్ద దిక్కుగా దాదాపు మూడు దశాబ్దాలు సేవచేసిన నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న. శ్రీకాకుళం జిల్లా బారువా జమీందారీలో విద్యాగంధం లేని వెనకబడిన వర్గాల కుటుంబంలో 1909 ఆగష్టు 16న పుట్టిన గౌతు లచ్చన్న బడిలో చదువుతున్నప్పుడే స్వాతంత్ర పోరాటంలో ముందడుగేశాడు. బారువా సమీపాన సముద్రతీరంలో ఉప్పుతయారు చేసి కారాగార శిక్షననుభవించాడు. కార్మిక రైతు ఉద్యమాలలో పనిచేశాడు.కమ్యూనిస్టు వ్యతిరేకతకు మారుపేరైన ఆచార్య రంగాగారి ప్రథమ శిష్యుడుగా పేరొందాడు. 1951లో రంగా నాయకత్వంలోని కృషికార్ లోక్‌పార్టీ తరఫున 1952 మొదటి ఎన్నికల్లో ఘన విజయం సాధించాడు. 55'లో కమ్యూనిస్టు వ్యతిరేక కూటమిలో వుండి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో చేరాడు.తర్వాత రంగా స్వతంత్ర పార్టీలోనూ జనతా పార్టీలోనూ,లోక్‌దళ్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వహించాడు. ఎమర్జన్సీలో ఆయన జైలుశిక్షననుభవించారు. మొత్తం 5 సార్లు శాసనసభకు ఎన్నికైన లచ్చన్న 1978లో ప్రతిపక్ష నాయకుడు. కాంగ్రెసేతర సంఘటనలలోనూ, అఖిలపక్ష ఉద్యమాలలోనూ వామపక్షాలతో కృషిచేసిన లచ్చన్న యన్‌టిఆర్ విజయం తర్వాత తన పార్టీ వారందరినీ తెలుగుదేశంలో చేర్చి తను దూరంగా వుండిపోయాడు.గీత కార్మిక సమస్యలపైన కూడా విస్తృతంగా కృషి చేశారు. ఆయన 2006 ఏప్రిల్‌లో మరణించారు.

నూరేళ్ల నివాళులందుకుంటున్న ఈ పెద్దల జాబితా అత్యంత వైవిధ్య భరితమైంది. ఎవరి విశిష్టతలు వారివే. ఇందులో ఎక్కువ మంది సాహిత్య వేత్తలుగా, కళాకారులుగా ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టిన వారే. జన బాహుళ్యాన్ని చైతన్య వంతులను చేసేందుకు, తెలుగు ప్రజల భావనా రేఖలను విస్తరించేందుకు అహరహం కృషి చేసిన వారే. అక్షర రంగ విహారులైనా ఆచరణాత్మక నేతలైనా ప్రతికూల పరిస్థితులను తట్టుకుని తమ ముద్ర వేసిన వీరి జీవితాలనూ కృషినీ మననం చేసుకోవడం మనకు కొత్త శక్తినిస్తుంది. హృదిలో స్ఫూర్తి నింపుతుంది.అందుకే మరోసారి వారికివే ' వంద' నాలు! ★

కాసు బ్రహ్మానందరెడ్డి

కవిత్వమ్

వానదేవుడేడి?

ఉండ్రాల రాజేశం

ఒక్క చినుకు పడితె
రైతన్న లేచె
దుక్కి దున్ని సాగు
చేసి పేడ వేస్తుండే
పది చినుకులు పడితె...!
మళ్ళీ నాగలి పట్టి
విత్తనం వేసిండు...!
కొన్ని చినుకులు పడితె
మొక్కలు మొలిచినవి
పడ్డ గడ్డినంత త్రవ్వి
ఎరువులు వేస్తుండు...!
ఇక చుక్క నీరు లేదాయే
ఒక్క వానా రాదాయె...?
పచ్చి కర్రలు వాడి



ఎండి ప్రోవ వట్టే
రైతన్న గుండెలో దిగులు
పడుతూనే ఉండె కానీ
వర్షమైతే రాకపోయె...?
ఎండుతున్న కర్రపై వాన
వచ్చిపోయే ఒక్కసారి
చచ్చి బ్రతుకుతూ
మొక్క గింజ తక్కువిచ్చే
కష్టపడిన రైతుకు
గింజలు కుంచమాయె
అప్పెట్లా కట్టాలి,
తిండెట్లా తినాలి...?
వానదేవుడేమో
గిట్ల చేసినాడాయె
బక్క చిక్కిన రైతు
బ్రతుకు కష్టమాయె
పస్తులుంటున్న రైతులు
చూసినెక్కడ గాని ఇంతె!!

★

ఒక మేలి ముసుగు కోసం

ఔను మనిషి యిప్పుడు
భోరున వర్షమవుతున్నాడు
గుండెలవిసేలా దిక్కులు పిక్కటిల్లేలా
కన్నీటి కెరటం అవుతున్నాడు
అస్థిపంజరం కాలేదు
వీపు కడుపు ఒకటిగా
గాలిలో ఆరిపోయే దీపంకూడా కాదు
నోటికి నాలుగు వేళ్ళూ అందిన వాడే
మల్లె పందిరిలా వున్నాడు
భీముడి తమ్ముడిలా వున్నాడు
అయినా సరే కళ్ల నీళ్ళబావులు
ముక్కు పుటాలు అదురుతూ
ముక్కుతూ మూల్గుతూ
గుండెలు కండలు బాదుకుంటూ
కదం తొక్కుతూ తొడలు చరుస్తూ
వీరంగం చేస్తూ నాట్యం చేస్తూ
ఇంకా యింకా అవినీతి కూపంలో
కూరుకు పోవాలనీ
అక్రమార్జనతో అనన్య సామాన్యుడిగా
వెలిగి పోవాలనీ
అసెంబ్లీయో లోక్‌సభో
స్థానిక సంస్థో ఏదో ఒకటి
ప్రజా నాయకుడిగా
సీటు పొందాలనీ
అధికారాన్ని అడ్డం పెట్టుకొని
అడ్డుగా బలవాలనీ
ఇంకా ఇంకా గుండెలు బాదుకుంటూ
గుండెలవిసేలా
ఓ మేలి ముసుగు కోసం
ఏడుస్తూనే....

★



నేటి నాయకుడు

కాకులకు చారెడు నూకలు పోసి
గద్దలను పోషించేవాడు
చీమల పుట్టలపై ప్రేమ చిలుకుతూ
పాముల గుహలను ఆహ్వానించేవాడు
రాజు పేద సమానమే అని
సూరీడు చంద్రుడు
తనకు రెండు కళ్ళని
అభివర్ణిస్తూనే
సూరీడు లేనిదే
చంద్రునికి వెలుగెక్కడిదని
చీమల పుట్టలు కూల్చి
సెజ్‌ల భవనాలు కట్టాలని
కలలు కంటూ
రైతన్నలను
తమ పొలంలోనే
కూలీలుగా మార్చేందుకు
అహర్నిశలూ ఆరాటపడేవాడు
అదే అభివృద్ధి పథంగా
అభివర్ణించేవాడు
వాడే సుమా
నేటి నాయకుడు

★

-బద్ది నాగేశ్వరరావు

క్రైమ్ కథ

దుర్వాసన

- యర్నాగుల సుధాకరరావు

"ఒక ఖూనీ చేసినట్టు అనుమానంగా ఉంది.రెండునెలల క్రితం ఇక్కడ రైల్‌రోడ్డులో జలీల్ హత్య జరిగింది.అందులో హంతకుడు ఎవరైందీ తెలియలేదు.ఇతడిపై అనుమానంగా ఉంది.ఎప్పుడైనా కన్పిస్తే మాకు చెప్పాలి. ఆమిద్దె ఇంట్లో ఇప్పుడు ఎవరైనా అద్దెకు దిగారా?"

"ఈఫోటోలో వ్యక్తిని నీవెప్పుడైనా చూసావా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

అక్కడ కొంతమంది గుమిగూడారు. కాలనీలో ఉండే చిల్లరవ్యాపారి ఆఫోటో చూసి "ఇతడు రాహుల్! ఇక్కడ ఆమిద్దె ఇంట్లో అద్దెకుండేవాడు.ఉదయం పడుకుని రాత్రిళ్ల ఎక్కడో మిల్లులో పనిచేసేవాడు. చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు సార్. ఇతనికోసం ఎందుకు అడుగుతున్నారు?"

"ఒక ఖూనీ చేసినట్టు అనుమానంగా ఉంది.రెండునెలల క్రితం ఇక్కడ రైల్‌రోడ్డులో జలీల్ హత్య జరిగింది.అందులో హంతకుడు ఎవరైందీ తెలియలేదు.ఇతడిపై అనుమానంగా ఉంది.ఎప్పుడైనా కన్పిస్తే మాకు చెప్పాలి. ఆమిద్దె ఇంట్లో ఇప్పుడు ఎవరైనా అద్దెకు దిగారా?"

"ఐదారుగురు వచ్చి చెడువాసన వస్తోందని ఖాళీచేసి పోయారు. ఆఇంటిపక్కనే మురుగు నీరు చేరుతుంది. ఇంటి ఓనర్ నల్లతంబి బాగుచేయించడు. ఆఇంట్లో ఎవరూ అట్టేకాలం ఉండరు"

ఇన్‌స్పెక్టర్ కాలనీలో ఐదారుగురికి చూపించి కన్పిస్తే సమాచారం అందించమనిచెప్పి వ్యాన్ ఎక్కి వెళ్లిపోయాడు.

ఆకాలనీలో సాయంత్రం వరకు అదే టాపిక్ చెప్పుకోసాగారు. రాహుల్ ఎంతో మంచిగా ఉండేవాడు. ఖూనీకోరా? అలాంటి వాడితో మనమెంతగా కలిసిపోయాం అని జరిగినదంతా గుర్తుచేసుకుని దడుసుకున్నారు.మిద్దెఇంటి యజమాని నల్లతంబి విషయం విని దడుసుకున్నాడు. రాహుల్ రెండు నెలల అద్దె ఎగవేసి కన్పించకుండాపోయాడు. వాడు మిగిల్చిన నాలుగు డ్రస్సులు వండుకునే సామాగ్రి నాఅద్దెకు అవిసరి పెట్టుకున్నాను. అదేం దరిద్రమో ఆఇంట్లో దిగేవారు ఎవరూ పట్టుమని పదిరోజులు ఉండడం లేదు.ఏదో దోషం పట్టుకుంది" అందరిమధ్య చెప్పి బాధపడ్డాడు.

"రేయ్ నల్లతంబి ఆఇంట్లో రాహుల్ ఏదో చేసిఉంటాడు. ఎవరినో చంపి పాతరేసి ఉంటాడు.వాడు ఎటో పారిపోయాక నీవు ఎవరెవరికో అద్దెకు ఇచ్చావు. ఆఇంట్లో చీడపీడలు ఎక్కువైనందున దిగినవారు పారిపోతున్నారు" అని ఒకడు ఊహించి ఇదిగో తోక అదిగో పులి కథలా చెప్పాడు. ఇదే కరక్టు అని అంతా ఆమాటలను మరింతగా సానబట్టారు.

అందులో ఒకడు ఆకాశరామన్న అవతారం ఎత్తేసి పోలీసులకు మిద్దెఇంట్లో పారిపోయిన రాహుల్ ఎవరినో చంపి ఆమిద్దెలో పాతేసాడని ఫోన్‌లో చెప్పేసాడు. పోలీసులు బిలబిలమని దిగారు. నల్లతంబితో మిద్దెఇల్లు తెరిపించి అన్నిగదులు చూసారు. ఒకగదిలో నేల చెమటలు పోసినట్టు నీటిచుక్కల చెమ్మతో నిండిఉంది. ఎందుకిలా ఉంది? ఈగది నేలను కొత్తగా ప్లాస్టింగు చేయించావా? అని నల్లతంబిని అడిగితే కాదన్నాడు. అతడికి ఎవరో కొత్తగా చేసినట్టు అనిపించింది.

వెంటనే పోలీస్‌డాగ్‌ను రప్పించి ఆగదిలో వదిలారు. అది నేల వాసనచూసి ముందుకాళ్లతో గచ్చునేల పొరలను లాగే ప్రయత్నం చేసింది. వెంటనే తవ్వకాలు జరిపించారు.అంతే ఒక అడుగులోతు తవ్వారో లేదో శవం ఒకటి బయటపడింది.గుప్పుమని దుర్వాసనతో ఆఇల్లు నిండిపోయింది. ఆశవం బాగా శిథిలమైపోయింది. క్లూస్‌టీమ్ తలమునకలయ్యింది. చివరికి తేలిందేమిటంటే ఆశవం ఎవరిదో కాదు! రాహుల్‌దే. శవం ప్యాంటులో దొరికిన పర్సులో ఫోటో చూసాక తెలుసుకున్నారు. మరి రైల్‌రోడ్డులో హత్య చేసింది రాహులే అని అప్పటికే అనుమానించారు పోలీసులు. ఆశవం వద్ద లభించిన కొన్ని ఆధారాలు రాహుల్‌వేనని నమ్మారు. ఇప్పుడు జలీల్ హత్య గోతిలో రాహుల్ శవం పోలీసులకు ముందు మిస్టరీగా నిలిచాయి. దర్యాప్తు వేగవంతం చేయడానికి అన్ని దారులు వెతికారు. జలీల్‌ను చంపింది రాహులే. మరి రాహుల్‌ను చంపింది ఎవరు? రెండు హత్యలు మిస్టరీగా జరిగాయి. ఇది పోలీసుల మెదడ్లను తొలుస్తున్న ప్రశ్న. జలీల్ వైపు నుంచి మరోసారి దర్యాప్తు చేసారు.

జలీల్ పదేళ్లక్రితం జయకర్‌తో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసాడు. కొన్నాళ్లయ్యాక ఇద్దరిమధ్య గొడవలు వచ్చి కోర్టులకెక్కారు. ఇప్పటికి కోర్టులో కేసుంది. కేసు జలీల్‌కు ఫర్‌గా తీర్పు వెలువడొచ్చు.అప్పుడు జయకర్ యాభైలక్షలు వరకు ఇవ్వాల్సి ఉంటుందని జలీల్ లాయర్ చెప్పాడు. పోలీసులు జయకర్‌ను అనుమానించి తీసుకువచ్చి ప్రశ్నించారు. తనకు రాహుల్ అనేవాడు ఎవరో తెలియదని చెప్పాడు. మిస్టర్‌క్లీన్‌గా ఉన్నాడనిపించి వదిలేసారు. ఆమరుసటిరోజు పోలీసులు మిస్టరీడెత్‌లో ఎవరెవరిని ప్రశ్నిస్తున్నారో పత్రికలు రాయడంతో పోలీసులకు ఒక ఫోన్ వచ్చింది.

"మీరు ప్రశ్నించి వదిలేసిన జయకర్ రాహుల్ తెలియదని చెప్పడం సరికాదు. జయకర్ రెండుమూడుసార్లు కారులో రాహుల్‌ని మిద్దెఇంటివద్ద దించాడు. నేను చూసాను. కావాలంటే గతనెల 25 రాత్రి రాహుల్ ఇంటికి వచ్చాడు. ఆరోజు నాపుట్టినరోజు కనుకనే తేది గుర్తుంది" చెప్పి ఫోన్ పెట్టేసాడు.

పోలీసులు మరుక్షణం జయకర్‌ను తీసుకుని వచ్చి ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరి చేసారు.గతనెల 25వ తేదిన రాహుల్ ఇంటిలో గడిపావు. ఆరోజుల్లోనే హతుడయ్యాడు రాహుల్. నిజం ఒప్పుకో లేకుంటే నిన్ను దారుణంగా ఇంటరాగేట్ చేస్తాం" అని హెచ్చరించారు. జయకర్ చివరికి ఒప్పుకోక తప్పలేదు. జలీల్ కోర్టులో ఖచ్చితంగా గెలుస్తాడని తేలిపోయింది. తీర్పు వెలువడకముందే కాంప్రమైజ్ కావాలనుకున్నాను. కానీ, అతడు అంగీకరించలేదు. నావద్దకు ఏదైనా పని చేస్తానని వచ్చిన రాహుల్ దృఢకాయం చూసి మరోలా వాడాలనుకున్నాను. అతడిలో తెగింపు జాలిలేనితనాన్ని గమనించి జలీల్‌ను చంపమన్నాను. రెండులక్షలు ఇస్తే చంపేస్తానని ఆవెంటనే పారిపోతానన్నాడు. మరీ మంచిదని ఆడీల్ ఒప్పుకున్నాను. అనుకున్నట్టే జలీల్‌ను చంపేసాడు. నేను ఇవ్వాల్సిన రెండులక్షలు ఇచ్చేసాను.అయితే రాహుల్ ఊరువదిలి పోలేదు. నేను అర్ధరాత్రివేళ రెండుసార్లు అతడింటికి వెళ్లి పారిపోమన్నాను. మరో రెండులక్షలు ఇస్తే తప్ప ఊరు వదిలిపోను అని పేచీకి దిగాడు ఆ25న ఇంటికి వెళ్లి డబ్బిచ్చాను. నేను రాహూల్ మద్యం తాగాం.అతడు మద్యం మత్తులో తెలివి తప్పాడు. నేను అతడిగొంతుకోసి చంపేసి చిన్నపాటి గునపంతో ఒకగదిలో అడుగులోతు తవ్వేసి శవాన్ని పాతేసాను. పూర్వాశ్రమంలో నేను తాపీపనివాడిని కావడంతో కారులో తెచ్చుకున్న సిమెంటు, ఇసుకతో గొయ్యి పూడ్చి గచ్చులా చేశాను"

పోలీసులు అవాక్కయి విన్నారు.

★

నవ్వుల్ - పువ్వుల్

రాణి, రాజు, ఆసు

మూడు తర్వాత ఏమొస్తుంది? టీచర్ అడిగింది చింటూను.

'నాలుగు'

'ఐదు తర్వాత'

'ఆరు'

'శభాష్, చాలా బాగా చెబుతున్నావే.

'ఇవన్నీ ఇంటి దగ్గర మా నాన్న నేర్పాడు.'

'ఏడు తర్వాత'

'ఏనిమిది'

'మీ నాన్నగారు ఇవన్నీ నేర్పి మంచిపని చేశారు సరే, పది తర్వాత ఏమొస్తుంది? 'జాకీ, దాని తర్వాత రాణి, తర్వాత రాజు, తర్వాత ఆసు' తడుముకోకుండా చెప్పాడు చింటూ.

సరదా



భార్య : అమ్మాయిని కొట్టారంట ఎందుకు?

భర్త : దానికి గాడిదనెక్కి ఊరేగాలనుందట. గాడితను నేనెక్కడ తెచ్చేది.

భార్య : కాసేపు వీపున ఎక్కించుకుని తిప్పితే మీ సొమ్మేం పోతుంది.

భర్త : ???!

పొదుపు

పెళ్లికి ముందు 'అమ్మాయి బాగా పొదుపు' అని చెబితే మంచిదే కదా అనుకుని పెళ్లి చేసుకున్నాను.

ఇప్పుడేమైంది, పొదుపరి కాదా? దుబారా మనిషా?'

'అదేంకాదు కానీ, గడ్డం చేసుకోవడానికి రేజర్లూ బ్లేడు ఎందుకు, కత్తిపీట చాలదా అంటోంది.'



ఎవరు?

కొడుకు : నాన్నా! కొడుకు తెలివైనవాడా? తండ్రి తెలివైనవాడా?

తండ్రి : తండ్రే తెలివైనవాడు.

కొడుకు : అదెట్లా వీలవుతుంది? కొడుకే తెలివైనవాడు.

తండ్రి : ఎట్లా చెప్పగలవు?

కొడుకు : సరే! స్టీం ఇంజన్‌ని ఎవరు కనిపెట్టారు?

తండ్రి : జేమ్స్ వాట్

కొడుకు : మరి వాళ్ల నాన్న ఎందుకు కనిపెట్టలేదు?

చేతి వంట

మా ఆవిడకు నా మీద కోపమొస్తే, బాగా దండిస్తుంది తెలుసా. చెప్పాడు చంద్రం, నాగరాజుతో.

"అంటే....బాగా దెబ్బలు తింటావా ఏమిటి?" కుతూహలంగా అడిగాడు నాగరాజు.

"అబ్బే! అదేం కాదురా.. తన చేత్తో వంట చేసి, తినమని బలవంతపెట్టి, మరీ తినిపిస్తుంది!'

విశ్వాసం

"కుక్క ఖరీదు ఎంతైనా కొంటాను. అయితే అది చాలా విశ్వాసం గలదై ఉండాలి" అన్నాడు నిత్యానందం.

"దీనికున్న విశ్వాసం మరే కుక్కకూ లేదండి. గతంలో దీన్ని మూడుసార్లు అమ్మాను. ప్రతీసారీ తిరిగి నా దగ్గరకే వచ్చేసింది " అసలు విషయం చెప్పాడు కుక్కలమ్మేవాడు.

విలువ

టీచర్ : మనం ఇనుప వస్తువును ఒక రాత్రంతా వర్షంలో పెడితే ఏమవుతుంది రఘు?

రఘు : తుప్పు పడుతుంది టీచర్.

టీచర్ : వెరీగుడ్, మరి బంగారు వస్తువు పెడితే?

రఘు : మాయమౌతుంది టీచర్.

జోక్స్ పంపాల్సిన మా చిరునామా : **నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.**

చెల్లెళ్ల కోసం...

కత్రినాకైఫ్, ఆయేషాటకియా, ఇషా డియోల్, అమృతారావు, సోనమ్ కపూర్ చాలా బిజీగా వున్నారండోయ్! నిజమా! అని ఆశ్చర్యపోకండలా. వీరంతా తమ చెల్లెళ్లను కూడా సినీరంగానికి పరిచయం చేసే పనిలో బిజీగా వున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు హీరోయిన్లుంటే ఆ గుర్తింపే వేరుకదా. అందుకే అంత తాపత్రయం. మరి ఆ విశేషాలేంటో చెప్పుకుందామా!

రియా కపూర్


ప్రీత


ఇషాబెల్


తనీషా

బాలీవుడ్ హీరోయిన్లు కొంతమంది తమ సోదరీమణులను తమకున్న ఇమేజ్‌తో సినీ ప్రపంచంలోకి తీసుకురావడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. సల్మాన్ తాజా చిత్రం 'వీర్'లో తన చెల్లెలు ఇషాబెల్‌కు అవకాశం ఇప్పించేందుకు కత్రినా కైఫ్ విఫలయత్నం చేసింది. గత సంవత్సరం కత్రినా తన చెల్లెలు ఇషాబెల్‌తో దిగిన ఫొటోలు మీడియాలోకి వచ్చినప్పుడే ఆమె సినిమా ప్రపంచంలోకి అడుగుపెడుతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ బాలీవుడ్‌లో అడుగెట్టడానికి తన చెల్లెలు మరీ చిన్నదంటూ మాట దాటేసింది కైఫ్. కాకపోతే ఆ తర్వాత కైఫ్ చెల్లెమ్మ 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్'లో చేరి నటనలో శిక్షణ పొందింది. ఇక్కడ తమాషా ఏంటంటే... 'వీర్'లో సల్మాన్ సరసన హీరోయిన్‌గా తన చెల్లెలికి అవకాశం ఇప్పించాలని చూసినా కుదరలేదు. ప్రస్తుతం ఆ పాత్రను మోడల్ లిసా లజారస్ చేస్తోంది.

టీవీ మోడల్, రచయిత్రి, అమృతారావు సోదరి అయిన ప్రీత బాలీవుడ్‌లో అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉంది. మణికందన్ కన్నడ చిత్రం 'చిక్కుబక్కు'లో చేసింది. అదేకాక మరో కన్నడ సినిమాలో చేయడానికి ఒప్పుకుంది.

అయితే సోదరీమణుల సాయం నటనకే పరిమితం కాలేదు. దర్శకత్వ శాఖ వరకూ విస్తరించిందనడానికి ఉదాహరణ ఇషా డియోల్ చెల్లెలు అహనా. ఈమె మెగాఫోన్ చేపట్టడానికే ఆసక్తి కనబరుస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఐశ్వర్య, హృతిక్‌రోషన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'గుజారిష్' దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దగ్గర అసిస్టెంటు డైరెక్టర్‌గా పనిచేస్తోంది.

సోనమ్ కపూర్ సోదరి రియా ఓ చిత్రానికి నిర్మాతగా చేస్తోంది. జేన్ ఆస్టిన్ రచించిన 'ఎమ్మా' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో వైవాహిక జీవితాన్ని ఇష్టపడే పాత్రలో సోనమ్ కనిపించనుంది. తన గారాలపట్టి సోనమ్ నటనాచాతుర్యాన్ని చక్కగా తెరకెక్కించేందుకే అనిల్‌కపూర్ ఆ చిత్రాన్ని సొంతగా నిర్మిస్తున్నారేమో! కానీ 'వేక్ అప్ సిడ్' చిత్రానికి రియా సహాయ దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించిందికదా. అనిల్ కపూర్ ఆ దిశగా ఎందుకు ఆలోచించలేదో మరి!!

జియా చోప్రా మాత్రం తన మామయ్య కూతురు ప్రియాంక చోప్రాను సినిమాల్లోకి తీసుకురావాలని అనుకుంటోంది.

విద్యాబాలన్ సోదరి ప్రియమణిది అసలైన అదృష్టం. 'రావణ్' సినిమాలో అభిషేక్‌బచ్చన్‌తో నటించబోతోంది. తెలుగు, తమిళ సినిమాల ద్వారా ఆమె ఇంతకుముందే సుపరిచితురాలు. తమిళ చిత్రం 'పరుత్తి వీరన్'లో చేసిన ఆమె నటనకు గాను జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఆమె ఇప్పుడు మణిరత్నం చేస్తున్న 'రావణ్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగెడుతోంది. ఆమె అందులో రావణుడి (అభిషేక్ బచ్చన్) చెల్లెలు శూర్పణఖగా చేస్తోంది. ఎప్పటికీ హీరో చెల్లెళ్లలా చేయాల్సివస్తుందనో, లేక అభిషేక్ పక్కన హీరోయిన్‌గా చేసే అవకాశమొస్తుందో రాదోనన్న భయంతోనో జూనియర్ బచ్చన్ చెల్లిగా చేయడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. కానీ ప్రియమణి మాత్రం టాప్ బాలీవుడ్ నటుడితో, మణిరత్నంతో చేయడం తన అదృష్టంగా భావించి ఈ అవకాశాన్ని కొట్టేసింది.

ఇలా ఒకరితర్వాత ఒకరిగా అక్కాచెల్లెళ్లు చిత్రరంగ ప్రవేశం చేస్తూనేవుంటారు. కాకపోతే ఆ విధంగా వచ్చిన వాళ్లు ఒకే రీతిలో ఎదగడం కొంచెం కష్టమే. అమృతా అరోరా-మలైకా అరోరా, షమితా షెట్టి-శిల్పా షెట్టి, సుష్మా రెడ్డి-సమీరా రెడ్డిని చూస్తే అదే తెలుస్తుంది. ఏదో కొన్ని జంటలు మాత్రమే చిత్రరంగంలో పేరు తెచ్చుకున్నాయి. గతంలో నూతన్-తనూజ, ఈ మధ్యకాలంలో కరిష్మా-కరీనా మంచి పేరు పొందిన అక్కాచెల్లెళ్లుగా చెప్పుకోవచ్చు. మరి ఇప్పుడు వస్తున్న వారిలో ఏ ఇద్దరు ప్రేక్షకులను అలరించనున్నారో చూడాలి! ★


ప్రియమణి


అహనా

కథ



ప్రేమ రాహిత్యం

- జి. అనసూయ

ఆఫీసు వర్కులో బిజీగా ఉన్న రజిత సెల్‌మోగడంతో ఉలిక్కిపడింది. టైం నాలుగైంది. ఆనంద్ చేసి ఉంటాడేమో, అనుకుంటూ నెంబరు చూసింది. ఊహు ఆనంద్ కాదు. "హలో" అంది సందిగ్ధంగా. "హలో... నేను సత్యసాయి రెసిడెన్షియల్ స్కూల్ నుండి మాట్లాడుతున్నాను. మీ అబ్బాయి ఆశిష్..." ఒక్కక్షణం ఆగాడతను. "చెప్పండి మా బాబు.. మా బాబుకేమైంది.." రజిత గొంతులో ఏడుపు జీర.

"మరేం కంగారు లేదు మేడం... బాబుకు ఏం కాలేదు... అయితే నిన్నటి నుండి విచిత్రంగా ఉంది అతని ప్రవర్తన... క్లాసులకు అటెండ్ కావడం లేదు. ఏమీ తినడం లేదు. అసలేమీ మాట్లాడ్డం లేదు. మీరు వెంటనే వచ్చి కొన్నాళ్ళు బాబును తీసుకెళ్ళండి.... బహుశా హోమ్‌సిక్ కావచ్చు" అంటూ ఫోను పెట్టేశాడు ఆ వ్యక్తి.

రజిత మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. ఏమైంది ఆశిష్‌కు... డాక్టరుకు చూపించారో లేదో సందేహం తీర్చుకుందామని మళ్ళీ అదే నెంబరుకు ఫోను చేసింది. కాని ఫోను ఎంగేజ్.

వెంటనే ఆనంద్ సెల్‌కు ఫోను చేసి విషయం చెప్పింది. మరో అరగంటలో ఆనంద్ వచ్చాడు. ఇద్దరూ కలిసి ఆశిష్ చదువుతున్న సత్యసాయి స్కూల్‌కు వెళ్ళారు టాక్సీలో. ఊరికి దూరంగా నలభై కిలోమీటర్ల దూరంలో కొండలు, గుట్టల మధ్య ఉంది ఆ స్కూల్. చుట్టూ చెట్టూ చేమా, రాళ్లూ రప్పలూ తప్ప ఊరూ వాడా, మనిషి జాడా లేని అటవీ ప్రాంతమది.

గేటునుండి లోపలికే ఓ కిలోమీటరు ప్రయాణం. తెల్లటి తాజ్‌మహల్ లాంటి బిల్డింగు. ఆవరణ అంతా పచ్చటి లాన్. చుట్టూ రంగు రంగుల పూలమొక్కలు. ఓపెన్ గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకుంటున్నారు. డ్రిల్లు మాస్టరు ఓ పక్క డ్రిల్లు చేయిస్తున్నారు. తెల్లటి యూనిఫాంలో పావురాయి రెక్కల్లా ఉన్న ఏడెనిమిదేళ్ళ పిల్లలు. అందరూ ఒకే సైజ్‌లో, ఒకే లాంటి డ్రెస్సుల్లో దూరానికి క్లోనింగ్ చిల్డ్రన్‌లా కన్పిస్తున్నారు. బహుశా ఆశిష్ వాళ్ళలో ఉన్నా తాము గుర్తించలేమేమో. రజిత కళ్ళలోంచి నీటి బొట్లు చెంపల మీదుగా రాలుతున్నాయి. ఆమెకు ధైర్యం చెబుతున్నట్లుగా పొదివి పట్టుకొన్నాడు ఆనంద్.

టాక్సీ దిగి లోపలకు వెళ్ళారు. సిక్‌రూమ్‌లో పడుకుని ఉన్న ఆశిష్ దగ్గరకు అటెండరు తీసుకు వెళ్ళాడు. "ఇప్పుడే డాక్టరు వచ్చి ఇంజక్షన్ చేసి వెళ్ళాడమ్మా..." సిక్‌రూమ్ ఇన్‌చార్జి చెప్పాడు. మగతగా నిద్రపోతున్నాడు ఆశిష్.

"చిన్నా.. ఏమైందిరా నాన్నా.." అంటూ కొడుకును ఒళ్ళోకి తీసుకుంది రజిత. "అసలేమైందండి బాబు చాలా ఆరోగ్యంగా ఉండేవాడు.." అన్న ఆనంద్‌కు లోగొంతుకతో చెబుతున్నాడు కేర్‌టేకర్. "మిస్టర్ ఆనంద్! మొన్నటి దాకా బాబు చాలా ఆరోగ్యంగా, ఆక్టివ్‌గానే ఉన్నాడు. ఉన్నట్టుండి మొన్న రాత్రి నుండి వింతగా బిహేవ్ చేస్తున్నాడు. తినడంలేదు, స్నానం చేయడం లేదు. క్లాసుకు కూడా వెళ్ళడం లేదు. అకారణంగా అరుస్తున్నాడు. దగ్గరకు వెళితే వయొలెంట్‌గా మీదపడి కొడుతున్నాడు. వాడి వస్తువులన్నీ విరగ్గొట్టి విసిరేస్తున్నాడు. వీడి ప్రాబ్లం ఏంటో మాకూ అర్థం కాలేదు. ఇది వరకు ఎప్పుడైనా ఇలా చేశాడా మేడమ్..." అంటూ అడిగాడు రజితను. "లేదండి. ఇలాంటి సమస్య ఎప్పుడూ రాలేదు. అయినా వాడు మూడేళ్ల బట్టి ఇక్కడే ఉన్నాడు కదా. ఇంతకు ముందు ఎప్పుడూ మామూలు సిక్‌నెస్ కూడా లేదు కదా..."

"అవును. ఆశిష్ సహజంగా చాలా బ్రిలియంట్, హెల్దీ అండ్ స్ట్రాంగ్. బహుశా ఇది ఏదైనా మానసిక సమస్య కావచ్చు. మీరు ఆశిష్‌ని వారం రోజులు ఇంటికి తీసుకెళ్ళండి. ఎవరైనా మంచి సైకియాట్రిస్టుకు చూపించండి" అని అన్నాడు కేర్‌టేకర్. "సైకియాట్రిస్టా..." అరిచినట్టుగా అంది రజిత. అంత కంగారు పడాల్సిన పని లేదు, ఇది మామూలు విషయమే అన్నాడాయన.

"శరీరానికి జబ్బు చేసినట్టే అప్పుడప్పుడు మనసుకూ జబ్బు చేస్తుంది. దానికి ట్రీట్‌మెంటు, రెస్టు అవసరం. ఆశిష్ ఇక్కడ ఉంటే మిగితా పిల్లలు డిస్టర్బ్ అవుతారు" సున్నితంగానే అయినా కచ్చితంగా చెప్పాడు అప్పుడే అక్కడికి వచ్చిన ప్రిన్సిపాల్.

సాయంత్రం ఏడవుతుండగా కళ్ళు తెరిచాడు ఆశిష్. తల్లిదండ్రులను చూసి చూపులు తిప్పుకున్నాడు. "ఆశిష్ మీ మమ్మీ డాడీ వచ్చారు. చూడు" అన్న కేర్‌టేకర్ మాటలకు "నో... వీళ్ళు మా మమ్మీ డాడీ కాదు.." గట్టిగా అరిచాడు. చూడగానే "డాడీ" అంటూ మెడచుట్టూ చేతులు వేసే ఆశిష్ తండ్రిని ఎవరో అపరిచితుడిని చూసినట్టు బ్లాంక్‌గా చూస్తున్నాడు.

హాస్టలు నుండి నేరుగా సైకియాట్రిస్టు దగ్గరకే వెళ్ళారు బాబును తీసుకొని. బాబుతో చాలా సేపు మాట్లాడాడు డాక్టరు. కేస్ హిస్టరీ, బాబు అలవాట్లు, స్కూల్లో అతని పెర్‌ఫామెన్స్, హాస్టల్‌లో ఎప్పుడు చేరింది అన్ని వివరాలూ అడిగి నోట్ చేసుకున్నాడు డాక్టరు. కొన్ని పరీక్షలు చేశాడు.

బాబు ఒక రకమైన మానసిక సమస్యతో బాధపడుతున్నాడని... ఆ వ్యక్తి లక్షణం, కావాలని తను ఉన్న పరిసరాలనుండి మానసికంగా దూరం కావడం. దీనికి సొల్యూషన్ ఏమిటా... అని ఆతృతగా చూస్తున్న రజిత, ఆనంద్‌లతో బాబును కొన్నాళ్ళ వరకు ఇంట్లోనే ఉంచమని మెడిసిన్స్ వాడుతూ, జాగ్రత్తగా అతణ్ని గమనిస్తూ రెండు వారాల తర్వాత రమ్మన్నారు డాక్టరు.

వికలమైన మనసుతో, బాబుతో ఇంటికైతే వచ్చారుగానీ, రజితకు మర్నాటినుండి బాబును ఎలా చూసుకోవాలి... అర్థంకాలేదు. తనకు సెలవు దొరికే పరిస్థితి కూడా లేదు. ఆఫీసులో ఆడిట్ జరుగుతోంది. మొత్తం ఆఫీసు పనంతా తనపైనే ఆధారపడి ఉంది. ఈ రిపోర్టుల మీదనే తన ప్రమోషన్ ఆధారపడివుంది. ఆనంద్‌ది ఎమర్జెన్సీ సర్వీస్. లీవ్ పెట్టడానికి వీల్లేని

ఉద్యోగం. మరి బాబును ఎక్కడ ఉంచాలి. ఇలాంటి పరిస్థితిలో ఒంటరిగా ఇంట్లో ఉంచడం మంచిది కాదు. ఎవరొస్తారు బాబును చూసుకోవడానికి? అత్తగారిని అడుగుదామంటే తనే ఓ పేషెంటు. అమ్మ ఒక్కతే ఈ విషయంలో తనను ఆదుకోగలదు. చూద్దాం అమ్మకు ఫోను చేసి మాట్లాడతాను అనుకుంది. రజిత "హలో అమ్మా నేను రజితను.." చాలా కాలానికి అమ్మతో మాట్లాడుతుండడంతో గొంతులో ఏడుపు జీర. "అమ్మా రజితా ఎలా ఉన్నావు? బాబు బాగున్నాడా? అల్లుడు గారు ఎలా ఉన్నారు?" అమ్మ గొంతులో ఎంతో మార్దవం.

"అమ్మా ఆశిష్‌కు ఆరోగ్యం బాగా లేదు. నిన్ననే హాస్టల్ నుండి తీసుకొచ్చాం". "ఏమైందమ్మా.. పిల్లలన్నాక మాములుగా జ్వరమో, జలుబో వస్తూనే ఉంటాయి. దానికంత కంగారెందుకు.." అంది అమ్మ ఓదార్పుగా. "జ్వరమో, జలుబో కాదమ్మా... వాడిది మానసిక వ్యాధి. వాడిని జాగ్రత్తగా చూసుకోమన్నారు డాక్టరుగారు. నాకేమో ఆఫీసులో ఆడిట్ పని ఉంది. అమ్మా నాలుగు రోజులు రాగలవా" బతిమాలుతున్నట్లుగా అడిగింది రజిత. "అలాగేలే రజితా దానికింతగా అడగాలా.. నేను రేపే వస్తాను. వచ్చాక ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అంటూ ఫోను పెట్టేసింది శారద. మర్నాడు ఉదయం ట్రైన్‌దిగి ఆటోలో కూతురి ఇంటికి వెళ్ళేటప్పటికే రజిత ఆఫీసుకు వెళ్ళే హడావిడిలో ఉంది. ఆనంద్ అప్పటికే వెళ్ళిపోయాడు. ఆశిష్ చక్కగా తన రూమ్‌లో పడుకుని నిద్రపోతున్నాడు. కాళ్ళు కడుక్కుని మనవడి రూమ్‌లోకి వెళ్ళి నుదుటిమీద చెయ్యి పెట్టి చూసింది శారద. మామూలుగానే ఉంది. తల్లి రాక చూసి వచ్చిన రజితను చూస్తూ "అసలేమైంది రజితా..? డాక్టరుకు చూపించారా..? ఏమన్నారు?" అనడిగింది. "సైకియాట్రిస్టుకి చూపించామమ్మా. బాబు ఆంగ్జయిటీ న్యూరోసిస్‌తో బాధపడుతున్నాడని, కొన్నాళ్లు రెస్టు ఇవ్వమని చెప్పారమ్మా... వీడిని ఒంటరిగా ఎలా వదిలి పోవాలా అని భయపడ్డాను. నువ్వొచ్చాక కాస్త ధైర్యంగా వుంది. వంట చేశాను. వాడిక్కావాల్సిన మందులన్నీ ఇక్కడ షెల్ఫులో పెట్టాను. ఫ్రిజ్‌లో పళ్ళు, జ్యూస్, పాలు అన్నీ వున్నాయి. వాడికి ఏం కావాలంటే అవి ఇవ్వు. అన్నట్టు ముందు నువ్వు కాఫీ తాగు" అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది రజిత.

'పిల్లవాడికి బాగా లేకపోతే ఇంటిపట్టున ఉండి చూసుకోవాల్సిన తల్లి వాడు నిద్రలేవకముందే వెళ్ళిపోతే ఇక ఇంటికీ, హాస్టల్‌కూ తేడా ఏముంది. ఏమిటో ఈ కాలపు తల్లులు' అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్లింది శారద.

తల్లి వెళ్ళిన అరగంటకు లేచాడు ఆశిష్. ఎదురుగా తననే చూస్తూ కూర్చున్న అమ్మమ్మను చూడగానే సంతోషంతో ప్రాణం లేచొచ్చింది ఆశిష్‌కు. "ఆశిష్ ఎలా వుంది నాన్నా.." లాలనగా తల నిమురుతూ అంది శారద. "నాకు భయంగా వుంది అమ్మమ్మా" ఏడుస్తూ అమ్మమ్మను చుట్టుకున్నాడు.

"భయమా? మా ఆశిష్ చాలా స్ట్రాంగ్ కదా. భయం దేనికి నాన్నా. హాస్టల్లో ఎవరైనా ఏమైనా అన్నారా?"

"లేదమ్మమ్మా... కానీ నాకు రోజూ కలలో నేనొక ఎడారిలో ఉన్నట్టు, నాలుక పీక్కుపోతున్నట్టు, మంచినీళ్లు ఒక్క చుక్కకూడా దొరకనట్టు, ఒక విచిత్రమైన జంతువు నామీద పడబోతున్నట్టు, ఇంకోసారి నేనో పెద్ద గోడకు ఉన్న నిచ్చెన మెట్లు ఎక్కి పైకి వెళ్లాక కిందకు చూస్తే నిచ్చెన మాయమైనట్టు అనిపిస్తుంది"

"పోనీ... ఆశిష్ అవన్నీ ఉట్టి కలలే కద నాన్నా... నీకేం కాదు. నువ్వు పడిపోతే మేం ఊరుకుంటామా? మేమంతా లేమూ? నిన్ను ఒంటరిగా వదిలేస్తామా?"

"లేదు అమ్మమ్మా! నాకు ఎవ్వరూ లేరు. అసలు అమ్మ కూడా నా సొంత అమ్మ కాదు. నాన్న కూడా అసలు నాన్నే కాదు. వీళ్లకు నేనంటే అసలు ఇష్టమే లేదు" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు ఆశిష్.

"అలా అనకూడదు ఆశిష్. మా బాబువు కదూ. అమ్మకు నువ్వంటే ఎంత ఇష్టమో తెలుసా. నువ్వు ఇంటికి వచ్చావని, నీదగ్గర వుండలేకపోతున్నానని నాకు ఫోనులో చెప్పి ఏడ్చింది. అందుకే నేను వెంటనే వచ్చేశాను" అంటూ ఆశిష్‌ను ఓదార్చి పాలు తాగించింది శారద. రోజంతా కథలూ, కబుర్లూ చెబుతూ తినడానికి ఏదో ఒకటి ఇస్తూ మనవడినే అంటిపెట్టుకుని ఉంది. సాయంత్రం కాగానే మళ్లీ పిచ్చిపిచ్చిగా మాట్లాడసాగాడు ఆశిష్. కోపంగా అరుస్తూ చేతికందిన వస్తువుల్ని విసిరికొడుతూ... "మీరంతా వెళ్లిపోండి.. నాకెవరూ వద్దు" అంటూ చిందులు వేయసాగాడు. రజిత ఆనంద్‌లకు దిగులుతో ఏమీ తోచలేదు. శారదకు ఏదో అర్థమైనట్టే అనిపిస్తుంది. ఆశిష్‌కు ఏ జబ్బూ లేదు. పొద్దునంతా తనతో బాగానే ఉంటున్నాడు. వాళ్ల అమ్మానాన్నల్ని చూస్తేనే అలా అబ్‌నార్మల్‌గా బిహేవ్ చేస్తున్నాడు. మూడోరోజు ఆశిష్ నిద్రపోయాక కూతురితోనూ, అల్లుడితోనూ మాట్లాడింది శారద.

"రజితా... నేను ఆశిష్‌ని కొన్నాళ్లు ఊరికి తీసుకెళతా. వాడు ఒక రకమైన డిప్రెషన్‌లో ఉన్నాడు. బహుశా వాడి జబ్బుకు 'ప్రేమ రాహిత్యం' అనే పేరు పెడితే సరిపోతుందేమో. ఈ యాంత్రిక వాతావరణం నుండి దూరంగా ఉంచడం వల్ల వాడి ఆరోగ్యం కుదుటపడొచ్చు" అంది శారద.

మరి చదువూ... స్కూల్... ప్రశార్థకంగా భర్తవైపు చూసింది రజిత. "అసలు వాడు ఆరోగ్యంగా ఉంటే కదా రజితా! చదువు సంగతి. పిల్లలు ర్యాంకుల పంటలు పండించే పొలాలు కాదమ్మా. ప్రేమానురాగాల నీరు పోసి జాగ్రత్తగా పెంచాల్సిన లేత మొక్కలు..." కూతురికి అర్థమయ్యేట్టు చెప్పడానికి ప్రయత్నిస్తూ అంది శారద.

"సరే అమ్మా... నీ దగ్గర వాడి ఆరోగ్యం బాగై మామూలు మనిషైతే చాలు" అంది రజిత.

మర్నాడే ఆశిష్‌ను తీసుకుని ఊరికి బయలుదేరింది శారద.

వచ్చే పెన్షన్‌తో తాము తింటూ నలుగుర్ని పోషించగలిగే పరిస్థితి ఉంది. అయినా ఉదయమూ, సాయంత్రమూ పిల్లలకు ట్యూషన్స్ చెబుతారు టీచర్లుగా రిటైరైన ఆ దంపతులు శారదా, రాఘవయ్య గార్లు. ట్యూషన్ అన్న పేరేగానీ ఫీజు కోసం ఎవర్నీ బలవంతం చేయరు.

అమ్మమ్మ గారాబం, తాతగారి క్రమశిక్షణ.. ఇంటికొచ్చే తన ఈడు పిల్లలతో మామూలు మనిషైపోయాడు ఆశిష్. నవ్వుతూ, తుళ్లుతూ తిరుగుతున్న మనవణ్ని చూసి "వీడికా మానసిక జబ్బు" అనుకున్నది శారద.

మరో వారం తరువాత డాక్టర్ దగ్గరకు వెళ్లిన ఆశిష్‌ను చూసి ఆయనే ఆశ్చర్యపోయాడు. "ఇదంతా నా ట్రీట్‌మెంట్ ఫలితమా... అమ్మమ్మా తాతయ్యల ప్రేమ ఫలితమా..." నవ్వుతూ ఆశిష్ భుజం తడిమాడు.

ఆనంద్, రజితలను ప్రత్యేకంగా పిలిచి చెప్పుకొచ్చాడు. "చూడండి మిస్టర్ అండ్ మిసెస్ ఆనంద్... ఇప్పుడు మీబాబును చూస్తే మీరు అతనికి ఇవ్వలేకపోయిందేమిటో మీకే అర్థమౌతుందనుకుంటా. చాలామంది మోడ్రన్ పేరెంట్స్‌లాగే మీరు కూడా పిల్లలకు మంచి డ్రెస్సులు, మంచి స్కూలు... వంటి సౌకర్యాలు కల్పిస్తే చాలని అనుకున్నట్టున్నారు. కానీ పిల్లలకు ముఖ్యంగా కావలసింది తల్లిదండ్రుల ప్రేమ, సాన్నిహిత్యం, ఆప్యాయతలు. మీ పని వత్తిడితో, బిజీ షెడ్యూల్‌తో మీ బాబుతో గడిపే తీరిక లేకపోవడం, మీ అబ్బాయిని బెస్ట్ స్కూల్లో వేసి సూపర్ చైల్డ్‌గా పెంచాలనుకోవడం, వాడి డిప్రెషన్‌కి కారణం. మీలాంటి పేరెంట్సు, ఇలాంటి యాంత్రిక సమాజం ఉండబట్టే మా ప్రాక్టీసు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. కానీ ఆనంద్‌గారూ... వికసించి, పరిమళాలు వెదజల్లాల్సిన పసి మనసులు ఇలా మొగ్గలుగా వాడిపోవడం విషాదకరం. పిల్లలు ఏదీ పైకి స్పష్టంగా చెప్పరు. వారి ఇష్టాయిష్టాలు సింబాలిక్‌గా వ్యక్తపరుస్తారు. మీరు మీ అబ్బాయి కోసం కెరీర్‌ను త్యాగం చేయడం ఇష్టం లేకపోతే వాణ్ని మీ అమ్మానాన్నల దగ్గరే పెరగనివ్వండి. ఆల్ ద బెస్ట్" అంటూ ముగించాడు సైకియాట్రిస్ట్, డోర్ తీసుకుని వచ్చిన మరో జంటని, వారితోపాటు స్కూల్ యూనిఫాంలో ఉన్న మరో బాబును చూడ్డానికి వెళ్తూ.

★

కొత్త పుస్తకాలు

సవివరంగా....రైతు ఉద్యమ చరిత్ర

"మిన్నులున్న చందమామయ్య చేతిలో మహిమ ఏమున్నది

మన్నులో నుండి అన్నము తీసే మహిమ నీకున్నది

ఐనా- మింటి చుక్కలల్లో వాడు

చెమట చుక్కలల్లో నువ్వు"

అంటూ రైతును ఆకుపచ్చ చందమామగా పోల్చే సుద్దాల అశోక్‌తేజ పాట ఒకటుంది. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో రానురాను వ్యవసాయం స్థితిగతులు ఎలా పరిణమిస్తున్నదీ, నమ్ముకున్న భూమిని రైతు అమ్ముకునే స్థితిగతులు ఎలా దాపరిస్తున్నదీ నేడు కనులముందు కనబడుతున్న కటిక వాస్తవం. అయినా వెన్నెముక ఒరిగిపోకుండా, విరిగిపోకుండా నేలవిడిచి బ్రతుకు సాము చేయదలచని రైతు వీరుడి ఉద్యమస్ఫూర్తికి ఒక చారిత్రక దర్పణం అన్నట్లుగా సారంపల్లి మల్లారెడ్డి సంతరించిన గ్రంథం 'రాష్ట్రంలో రైతు ఉద్యమం (1947- 2007).



రాష్ట్రంలో రైతు ఉద్యమం (1947-2007)
సారంపల్లి మల్లారెడ్డి
వెల : 80రూ
పేజీలు:
ప్రజాశక్తి బుక్‌హౌస్
ఎమ్‌హెచ్.భవన్
ప్లాట్‌నెం 21/1
ఆర్.టి.సి.కళ్యాణమండపం దగ్గర
అజామాబాద్, హైదరాబాద్-20

అసలు 'సంఘం' అనే పదమే రైతాంగ సంఘటిత చైతన్యానికి ప్రతీకగా నిలచిన కాలం వుంది. ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ ఉద్యమం గర్వించదగిన విధంగా ఎలా పురోగమించిందీ, ఎప్పటికప్పుడు తలెత్తే సమస్యలతో సంఘర్షిస్తూ ఎలా పోరాటాలు చేసిందీ, ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల కారణంగా అతలాకుతలమైన వ్యవసాయ జీవన పరిస్థితుల్లో రైతు ఉద్యమాలు ఏ స్వరూప స్వభావాలతో ఆచరణాత్మకమయ్యిందీ ఈ గ్రంథంలోని పదమూడు అధ్యాయాల్లో సవివరంగా నమోదు చేయడం జరిగింది. జమీందారీ వ్యవస్థను నిర్మూలించి రైతుకే భూమిపై సర్వహక్కులూ భుక్తమయ్యేందుకు సాగించిన అసాధారణ పోరాటాలే రైతు సంఘ ఆవిర్భవానికి నాంది పలికినది. మొదలుగా సంఘ సారథ్యంలో రైతు ఉద్యమగమనాన్ని మహాసభల క్రమం ప్రాతిపదికగా ఈ గ్రంథంలో మల్లారెడ్డిగారు విశ్లేషించి విశదపరిచారు.

రాష్ట్ర రైతు ఉద్యమచరిత్రను స్థూలంగా ఐదు దశలుగా విడగొట్టవచ్చు.

ఒకటి : స్వాతంత్ర్యానికి పూర్వం (అంటే 1947 వరకు). రెండు : స్వాతంత్ర్యం వచ్చింది. మొదలుకొని ఆంధ్రప్రదేశ్ ఏర్పటయ్యేవరకు (47 -56 మధ్య). మూడు : 1956 నుండి 1980ల వరకు. నాలుగు : 80-90ల మధ్య. ఐదు : 90ల నుండి ఇప్పటివరకు అన్నట్లుగా రచయిత ఎనిమిదవ మహాసభ నుండి 18వ మహాసభ వరకూ, ఆ తర్వాత '2006-2007 ఉద్యమాలు' అంటూ క్రమానుగత ఉద్యమ పురోగమనాన్ని ఒక్కొక్క ప్రకరణంలో చక్కని నివేదికలుగా విశ్లేషించి చూపారు .

90లలో ఆర్థిక సంస్కరణలొచ్చాక జాతీయస్థాయిలో బడా బూర్జువా వర్గానికి, ప్రాంతీయ బూర్జువాకీ మధ్య, బూర్జువా, భూస్వామ్య వర్గాలమధ్య వైరుధ్యం తగ్గింది. దాని ప్రభావం సంకీర్ణ రాజకీయాలపై పడింది. వివిధపార్టీలు ఒకే ప్రయోజనంకోసం ఉమ్మడిగా ప్రభుత్వాలను ఏర్పాటుచేసే ప్రక్రియ వచ్చింది. అందరూ కలసి మాటలేం చెపుతున్నా రైతులకు అన్యాయం చేయడంలో ఒకే విధానం కలిగి ఉంటున్నారు. ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా బ్యాంకు రుణాలను తగ్గించడం, సబ్సిడీలపై కోత, మార్కెట్ శక్తులకు ఊతమివ్వడం, భూసంస్కరణలకు స్వస్తిచెప్పడం, సెజ్‌లు, పరిశ్రమలు, ప్రాజెక్టులు, టూరిజం, రింగ్‌రోడ్లు, కారిడార్‌ల పేరుతో పేదరైతుల భూముల్ని ప్రభుత్వ భూముల్ని కారుచౌకగా కార్పొరేట్ పరం చేయడం వంటి అనేక రైతు వ్యతిరేక చర్యలకు దిగుతున్నాయి. ఒకరిపేరుతో మరొకరు ఇదే విధానాలను కొనసాగిస్తున్నారు. దుష్ఫలితాలను ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటున్నారు. అధికారపార్టీలు అనుసరిస్తున్న ఈ మోసపుటెత్తుగడలను రైతాంగం ఎండగట్టాలి" అన్న మాట యుధార్థం. 'ప్రపంచీకరణ ముక్కలు ముక్కలు చేస్తున్న ప్రజాఉద్యమాలను సంఘటితం చేసి మహాప్రవాహంగా మార్చవలసిన బాధ్యత ఈ రోజు ప్రజాతంత్ర ఉద్యమాలపై ఉంది' అంటూ ముందుమాటలో వి.శ్రీనివాసరావుగారు రైతుసంఘ పునరుజ్జీవన శక్తికి ఈ పుస్తకం దోహదం చేయ గలదని స్పష్టంగా సూచించారు. ఆంధ్రరాష్ట్ర రైతు మహాసభలు గురించిన పట్టికలతో సహా సవివరంగా సంతరించిన ఈ గ్రంథం స్ఫూర్తిదాయకమైంది. తొమ్మిదవ మహాసభలో పుచ్చలపల్లి సుందరయ్యగారి సమీక్షా ఉపన్యాసం నేటికీ శిరోధార్యమైన సందేశంతో భాసిస్తోంది. మల్లారెడ్డిగారు దాని పూర్తిపాఠాన్ని ఇవ్వడం ఎంతో బాగుంది. రైతు ఉద్యమ చరిత్రకు ఒక స్ఫూర్తివంతమైన మంచి రికార్డు ఈ గ్రంథం.

- సుధామ

స్వీకారం



మానవతా పరిమళాలు
వేముల పెరుమాళ్ళు ప్రసంగాలు
వేముల ప్రభాకర్
వెల : 100/-, పేజీలు : 142,
ప్రతులకు : వేముల రోహిత్, న్యాయవాది,
ప్లాట్ నెం.502, ప్రగతి రెసిడెన్సీ, వీధి నెం.9,
ఈస్ట్‌మారేడ్‌పల్లి, సికింద్రాబాద్













ఏం కట్టడాలు!

కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల...కాదేదీ కవిత్వానికనర్హం అన్నాడు మహాకవి. ఇక్కడ కనిపిస్తున్న ఫొటోలు చూస్తుంటే దాన్ని కొద్దిగా మార్చి 'కాదేదీ కళా సృజనకనర్హం' అని రాసుకోవచ్చేమో అనిపిస్తోంది. ఎలాగంటారా! ఈ ఫొటోల్లో కనిపిస్తున్న కట్టడాలన్నీ ప్రపంచ ప్రసిద్ధి చెందిన బిగ్‌బెన్, వాటికన్ సిటీ, టవర్ బ్రిడ్జ్, తాజ్‌మహల్ వంటి కట్టడాలే. కాకపోతే అవన్నీ పళ్లు కుట్టుకునే పుల్లలతో చేసినవే. వాటిని సృజించింది ఎవరనుకుంటున్నారు?! స్టాన్ మన్రో. ఇతగాడు ఒక్కో కట్టడాన్నీ ఒకటి నుంచి ఆరు నెలల లోపు పూర్తి చేస్తుంటాడు. వీటికి కావాల్సిన డిజైన్లను ఇంటర్‌నెట్ నుంచి తీసుకుంటాడు. అంతేకాదండోయ్. తను చేసిన పుల్ల కట్టడాలతో ఎగ్జిబిషన్లు కూడా ఏర్పాటుచేస్తుంటాడు. తాజాగా 'సిటీ-2' కు సంసిద్ధమౌతున్నాడు. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన, పొడవైన కట్టడాలు, ఆలయాలను నలభైపైగా ప్రదర్శించనున్నాడు. దీనికోసం నాలుగేళ్లగా శ్రమిస్తున్నాడు. 'ప్రపంచ సందర్శన చేయలేని వారు ఈ ఎగ్జిబిషన్ చూస్తే చాలు. అన్ని ప్రముఖ కట్టడాలు కనిపిస్తాయ్' అంటాడతగాడు కొంటెగా. నిజమేకదా!







సాహసి

చాలా సంవత్సరాల కిందటి కథ ఇది. అప్పుడు చైనాలో ఓ భార్యా భర్తా వుండేవారు. వారికి చాన్నాళ్లపాటు పిల్లలు పుట్టరు. అదే పెద్ద దిగులుగా వుండేది. కనిపించిన ప్రతి గుడికి వెళ్లేవారు. మొక్కేవారు.

"ఒక్క పాపో బాబో పుడితే చాలు. వారు ఎలాంటివారైనా సరే. అందంగా వున్నా లేకపోయినా... ఎంత చిన్నగా వున్నా... ఒక్కనలుసు పుడితే చాలు" సంతోషిస్తామనుకునేవారు. ఎలాగో ఓసారి వారికి ఓ బాబు పుడతాడు. కాకపోతే వాడు చాలా అంటే చాలా చిన్నగా వుంటాడు. మరీ అంత చిన్న పిల్లాడ్ని చూచి భార్యాభర్తలిద్దరూ ముందు బాధపడ్డా...తర్వాత ఆ చిన్ని బాబే తమకు లభించిన వరమనుకుంటారు. ఆనందంగా పెంచుకుంటుంటారు.

వాడు పెరిగి పెద్దవుతాడు. వయసు పెరుగుతుందేకానీ శరీరం మాత్రం పెద్దగా ఎదగదు. అయితే తెలివితేటలు మాత్రం అమోఘం. ఎంత పెద్ద సమస్యనైనా చిటికెలో పరిష్కరించేవాడు. అలా ఆగ్రామంలో మంచి పేరు సంపాదిస్తాడు. అందరూ వాడిని చూచి జాలిపడినా వాడి మేధాశక్తిని చూచి మెచ్చుకుంటూ...

"మీ వాడిని ఇలా ఈ పల్లెటూళ్లోనే వుంచితే లాభమేముంది? చక్కగా రాజధానికి పంపితే రాజదర్బారులో చేరి ప్రయోజకుడౌతాడు. మన రాజ్యానికే పేరు తీసుకొస్తాడు" అంటారు.

అది చిన్నోడి తల్లిదండ్రులను ఆలోచింపచేస్తుంది. వెంటనే వాడిని పిల్చి ...

"ఒరే చిన్నోడా! నువ్వు రాజధానికి వెళ్లు. అక్కడే ఏదైనా పని చూసుకో. ఇక్కడ వుంటే ఇలాగే గడిచిపోతుంది. నీకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తాం. నువ్వు కూడా సిద్ధంగా" అంటారు.

దానికి చిన్నోడు సరేనంటాడు ఉత్సాహంగా.

చిన్నోడి తల్లిదండ్రులు వెనువెంటనే వాడికి కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోతారు. ముందే చెప్పకున్నాంకదా. చిన్నోడి శారీరక స్థితి గురించి. ఒక సూదితో కత్తిని, అన్నం తినే బొచ్చెతో పడవను చేసి... దారిలో తినడానికి కొద్దిగా అన్నం మూటకట్టి ఇస్తారు. చిన్నోడు వాటిని తీసుకుని ఊరివారందరికీ వీడ్కోలు పలికి రాజధాని బాట పడతాడు.

మరి చిన్నోడు కదా. ఎన్నో రోజులపాటు నడుచుకుంటూ నడుకుంటూ... వెళ్తుంటాడు. మార్గమధ్యలో ఓ నది వస్తుంది. తన బొచ్చె పడవ సాయంతో నది ఈదీ ఈదీ ఒడ్డు చేరుకుంటాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే రాజధాని చేరతాడు. అక్కడ ఎలాగోలా రాజమందిరం చేరతాడు. అక్కడ ఓ సైనికుడితో మాట్లాడడానికి ఒక రోజు పడుతుంది. మరి అతగాడికి చిన్నోడు కనిపించడాయె. మాటలు మాత్రం కీచుగా వినిపిస్తుంటాయి. ఇంక ఏం చేస్తాడు. ఎలాగోలా సైనికుడి దృష్టిలో పడి అతనికి అసలు విషయం చెప్తాడు.

"నేను రాజప్రాసాదంలో ఉద్యోగం కోసం వచ్చాను. దయచేసి ఏదైనా కొలువు చూపించవా?" అంటాడు.

దానికతను ఫక్కున నవ్వి..."ఏంటి! నువ్వు ఉద్యోగం చేస్తావా? అదీ రాజుగారి మందిరంలో. ఇంతకంటే తమాషా ఇంకేదైనా వుంటే చెప్ప నమ్ముతాను గానీ ఇది మాత్రం నమ్మను" అంటాడు.

అతనిని ఎలాగోలా ఒప్పించేసరికి చిన్నోడికి అలుపొచ్చేస్తుంది. చివరికి ఎలాగోలా రాజుగారి ముందు నిలబడి తన మనసులోని మాటను విన్నవించుకుంటాడు.

అది విన్న వారంతా నవ్వుతారు. రాజైతే పడి పడి నవ్వుతాడు. "నువ్వు బుడంకాయంత కూడా లేవు. నువ్వు ఇక్కడేం చేస్తావయ్యా. కానీ ఇంతగా బతిమాలుతున్నావు కాబట్టి... యువరాణి మందిరంలో వుండు. తను ఏదైనా చెప్తే చేస్తుండు" అని పంపిస్తాడు. దానికే చిన్నోడు చాలా సంతోషిస్తాడు.

ఓసారి యువరాణి ఓ ఆలయానికి వెళ్తూ చిన్నోడిని కూడా తీసుకెళ్తుంది తోడు. అతను తన కత్తి కూడా వెంట పట్టుకెళ్తాడు. దారిలో అలా వెళ్తుండగా...అకస్మాత్తుగా ఇద్దరు రాక్షసులు ప్రత్యక్షమౌతారు. వారి చేతుల్లో రెండు ఆయుధాలుంటాయి. ఒకడి దగ్గర వున్న ఆయుధంతో దేన్నైనా ఎంత పెద్దగానైనా చేయొచ్చు. రెండోవాడి చేతిలో వున్న ఆయుధంతో దేన్నైనా ఎంత చిన్నగానైనా చేయొచ్చు. చిన్నోడు ఎంతో సాహసోపేతంగా వారితో పోరాడుతుంటాడు. అదను చూసుకుని ఒకడి భుజం మీదకు దూకి కత్తిని కంట్లోకి గుచ్చుతాడు. దాంతో అతను చనిపోతాడు. అప్పుడు యువరాణి చప్పట్లు చరుస్తూ...

"ఓ చిన్నోడా! అతని చేతిలో వున్న ఆయుధం తీసుకో. దాని సాయంతో దేన్నైనా ఎంత పెద్దగానైనా చేయొచ్చు" అంటుంది. అతను తీసుకుంటాడు. ఇది చూచిన రెండవవాడు పారిపోతాడు. అప్పుడు యువరాణి ఆ ఆయుధాన్ని తీసుకొని చిన్నోడి తలకు తాకిస్తూ... "పెద్దగా అవ్వు.. ఇంకా పెద్దగా అవ్వు..ఇంకా పెద్దగా అవ్వు" అంటూ మామూలు యువకుడిని చేస్తుంది. తన రూపం మారిపోయేసరికి చిన్నోడు ఎంతో సంతోషిస్తాడు. తన కుమార్తెను రాక్షసుల బారినుంచి కాపాడినందుకు రాజుగారు ఎంతగానో సంతోషిస్తాడు. పైగా వారిద్దరికీ పెళ్లి జరిపిస్తాడు. ఇద్దరూ సంతోషంగా జీవిస్తారు.

\- చూటీ